POSTAL REGD.NO.PRAKASAM/2026-2028
REGD.NO. APTEL/26/A0220
ESTABLISHED : 1983
జూలై 2026
వెల – ₹ 10.00


# సాయిబాబా


ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 44 సంచిక: 03




## స్వామి వివేకానంద ఆరాధన

జూలై 04, 2026 | జూలై 12, 2026 (తిథి)

# ఈ నెల పండుగలు

జూలై 04 - శ్రీ వివేకానంద స్వామి ఆరాధన

జూలై 12 - శ్రీ స్వామి వివేకానంద ఆరాధన (తిథి - ఆషాడ బహుళ త్రయోదశి)

జూలై 29 - శ్రీ గురు పూర్ణిమ







మాతృదేవి ఆరాధనా మహోత్సవ సందర్భంగా గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు 'దివ్య జనని అలివేలు మంగమ్మ లీలా వైభవం' గ్రంథం 1, 2 భాగాలను ఆవిష్కరించారు. ఈ ఉచిత గ్రంథాలని భక్తులు శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్ హైదరాబాదు, ఒంగోలు ఆఫీసుల నుంచి పొందగలరు.

# శ్రీ సాయిబాబాను అసలు ఎందుకు పూజించాలి?

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ఆధ్యాత్మిక జీవితానికంతటికి మహనీయులు మూలస్తంభాలవంటివారు. మానవ జాతికంతటికీ వారే కేవల ప్రాకృతికము, పాశవికము అయిన జీవితానికంటే అత్యున్నతమైన, శాశ్వత దుఃఖ రహితమైన జీవితమొకటున్నదని తెల్పారు. వేదాలు అట్టివారి తపః ఫలితమే. పురాణాల ద్వారా దేవతలు, అవతారమూర్తుల గురించి జాతి కెరుకపరచి, సకల శాస్త్రాల ద్వారా అట్టి ఆధ్యాత్మిక జీవితానికంతటికి అత్యావశ్యకమైన పథాన్ని ఆదేశించారు. తిరిగి కాలగతిలో అనేకమంది ధీరులు ఆ పంథాను తొక్కి, అత్యున్నతమైన ఆధ్యాత్మిక శిఖరాన్నంది, ఆధ్యాత్మ విద్య ఎంతవాస్తవమో, ఎంత ఉత్కృష్టమో మనకు ఋజువు చేసి మనలను ప్రోత్సహిస్తున్నారు. కనుకనే నిత్యమూ మనలో ఆజ్ఞాతంగా వుండిపోయిన ఆత్మకంటే కూడా, దీనిని గూర్చి మనకు తెల్పి పరమశ్రేయస్సు చేకూర్చిన అట్టి సద్గురువులే మనకధికులని చెప్పాలి. వారి అనుభవజనితవాక్యాలైన శాస్త్రాలను సరైన విధంగా మనకు వివరించడానికి వారే అవసరమవుతున్నారు.

ఇలా ప్రపంచంలో వేర్వేరు దేశకాలాలకనుగుణంగా ఉత్పన్నమైన వివిధ మతసాంప్రదాయాలలోని బాహ్యాచార భేదాల వలన వాటిననుసరించే మానవుల మధ్య వారి అజ్ఞానం వలన ఏర్పడే ద్వేషాన్ని రూపుమాపి సర్వమతాల సామరస్యాన్ని మనకు అధికార పూర్వకంగా నిరూపించగలవారూ మహనీయులే!

సర్వగతమైన ఆత్మ ఒక్కటేనన్న పరమసత్యం మన నిత్యజీవితానుభవానికి వ్యతిరేకం. కాని అట్టిదాన్ని అంగీకరిస్తే తప్ప ప్రతిమానవుడూ సాటివారిని తన వలెనే ప్రేమించడమన్న ప్రాథమిక దర్మసూత్రానికర్థముండదు. ఆ సూత్రాన్ననుసరించే సకల ధర్మశాస్త్రాలు ఏర్పడ్డాయి. కాని, అట్టి ప్రత్యక్షానుభవం లేకపోవడం చేతనే సామాన్యులకు ధర్మాన్ని అనుష్ఠించడం అంతకష్టమౌతుంది. అట్టి అనుభవాన్ని తాము పొంది, తదనుగుణమైన విధంగా జీవిస్తూ, అట్టి అనుభవాన్నాధారంగా గల లీలలను ప్రకటించి భక్తుల జీవితాలను ధర్మబద్ధంగా తీర్చిదిద్దగల వారే మహాత్ములు.

కనుక యిట్టి సద్గురువులే మన మధ్య అవతరించకుంటే సకల శాస్త్రాలు అసత్యాలేమోనన్న అనుమానం మానవ జీవితాన్ని పూర్తిగ కబళించి ప్రజలను ధర్మభ్రష్టులను, పశుప్రాయులనూ చేస్తుంది. కనుక మానవజాతి కింతకంటే శ్రేయస్సును చేకూర్చగల దైవం వేరొకటిలేదనే చెప్పాలి. అందుకే గురుగీత చెబుతుంది.

**శ్లో॥ ధ్యానమూలం గురోర్మూర్తిః**
**పూజామూలం గురోః పదమ్ ।**
**మంత్రమూలం గురోర్వాక్యం**
**ముక్తిమూలం గురోః కృపా ॥**

*మిగతా 29వ పేజీలో*

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:44 జూలై - 2026 సంచిక:03


*పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"*

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | శ్రీ సాయిబాబాను అసలు ఎందుకు పూజించాలి? | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | గుర్వాజ్ఞ | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 10 |
| 05. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 12 |
| 06. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి రాజసులోచన | 14 |
| 07. | మాతృదేవి పంచమ ఆరాధనా మహోత్సవం | శ్రీమతి టి. పద్మావతి | 16 |
| 08. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ గుండాల జలంధర్ | 22 |
| 09. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ జయచంద్రారెడ్డి | 25 |


**సాయిబాబా పత్రిక పాఠకులందరికీ శ్రీ గురు పూర్ణిమ శుభాకాంక్షలు!!**

స్థలాభావం వల్ల ఈ సంచికలో 'శ్రీశ్రీశ్రీ మాత ఆనందమయి జీవితం మరియు బోధలు' మరియు 'బుద్ధ ధ్యాన హృదయము' ప్రచురింపబడడం లేదు.


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271
www.saibharadwaja.org



చీఫ్ ఎడిటర్: డా|| ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹10-00
సంవత్సర చందా : ₹100-00



సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

## ప్రశ్న :- ధర్మము, దానములు మనమీ కాలములో ఉత్తమంగా ఆచరించగల పద్ధతి సూచించండి ?

**- ఎమ్.జనార్ధన శెట్టి, సూళ్లూరుపేట**

**జవాబు :-** అన్ని జీవుల రూపాలలోనూ ఆ సద్గురువే ఉన్నాడన్న అవగాహనతో జీవించడమొక్కటే ధర్మాచరణకు మూలం. అది ఉత్తమం. మనలోని ఆత్మయే సర్వులలోని ఆత్మయని, మన కష్టసుఖముల వంటివే వారివిగూడ అని గుర్తించి నడచుకొనడం మధ్యమం. అంటే మనకితరులేది చేయాలనుకుంటామో అదే యితరులకు మనం చేస్తూ యితరులు మనకేది చేయకూడదనుకుంటామో మనం అది యితరులకు చేయకుండడం మధ్యమం. కారణం మొదటిది పారమార్థికదృష్టి. రెండవది కేవలం మానవతా దృష్టి. స్వర్గం కోసం, మంచి జన్మల కోసం ఆశించి మాత్రమే ధర్మం చేయడమూ, నరకము మరియు దుఃఖపూరితమైన జన్మలకు వెరచి మాత్రమే, పాపం చేయకుండడము అధమపక్షం. అయినప్పటికీ ధర్మమాచరించకపోవడం అధమాధమం.

సాటివారు కూడా ధర్మమాచరించనిదే, మనమొక్కరమే ధర్మ మాచరించడం ఎంతో కష్టంతో కూడిన పని. ఆ కారణంగా మాత్రమే సాటివారికి కూడ ధర్మప్రబోధం చేయడం మధ్యమపక్షం. సృష్టిలో ప్రతిజీవి సాటి జీవులకు హితం చేస్తూ మాత్రమే జీవిస్తుండడం వలన మనం జీవించగల్గుతున్నాము. చెట్లు కాయలను, పశువులు పాలు యిస్తూంటేనే మనం జీవిస్తున్నాం, కనీసం వాటి మాత్రమైనా సాటి జీవులకు హితం చేయడం మన ప్రధాన కర్తవ్య భావనతో సాటివారికి ధర్మప్రబోధం చేయడం అంతకంటే మేలైనది. సర్వజీవులకు ఆత్మోద్ధరణ కవకాశమివ్వడమే భగవంతుని సంకల్పమన్న విశ్వాసంతో ధర్మ ప్రబోధం ఆయన సేవగా చేయడం అత్యుత్తమం. ఇందువలన సర్వులకూ ఉత్తమ జీవిత విధానం తెలిసి, వారి జన్మ పరంపరలన్నీ ఉత్తమములయ్యే అవకాశం వారికి కలుగుతుంది. అట్టి ధర్మాన్నాశ్రయించుకొని అర్థము, కామము, మోక్షము సాధించుకొనటమే సత్యయుగమంటే! మార్క్సిజం, మానవతావాదం మొదలైన నాస్తికోద్యమాలు కూడా చివరకు ధర్మ ప్రబోధమే చేయడం చూడవచ్చు. అందుకే మతాలన్నీ ధర్మప్రచారానికి అంత ప్రాముఖ్యమిచ్చాయి --స్వార్థం, సంకుచిత్వము మొదలైన కారణాలుగా గూడ కొందరు ధర్మ ప్రచారానికి పూనుకొనడం వల్లనే ఎంతో అరిష్టం జరుగుతుంది. కృతజ్ఞతతో మంచిని ఆచరించలేనివారు చేసే ప్రబోధమెంత బాగున్నట్లనిపించినా, అది మురికిగుంటలో పడ్డ గంగాజలం వలె స్వీకరించదగదని ఋషులందుకే చెప్పారు.

అన్ని దానాలకంటే అన్నదానం గొప్పదన్నారు. కాని విద్యాదానం వల్ల ముల్లోకాలూ దానమిచ్చినంత ఫలితమని మహాభారతం చెబుతుంది అందుకు వినియోగించిన ధనమే వుత్తమమైన దానం. అందుకే 'శ్రీ సాయిబాబా జీవితచరిత్ర', 'శ్రీ గురుచరిత్ర', 'శ్రీ సాయి ప్రబోధామృతము' మొIIనవి ప్రచురించడానికే మనమంతగా ప్రయత్నించేది. సత్సంగాల ద్వారా

*మిగతా 29వ పేజీలో*

(జూలై 2013 సాయిబాబా మాసపత్రిక నుండి)

# గుర్వాజ్ఞ

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

సద్గురువు ఇది చేయమనిగాని, చేయవద్దని గానీ చెప్పినదానిని గురువు యొక్క ఆజ్ఞ అని, లేక గురువు యొక్క ఆదేశమనీ చెబుతారు.

గురువు యొక్క ఆజ్ఞ వాచా కావచ్చు, లేక అనేక విధాలుగా గూడ వుండవచ్చు.

ఈ వాక్కు ద్వారా చెప్పడంలో గూడ గురువు అనేక విధాలుగా చెప్పవచ్చు. నెమ్మదిగా చెప్పవచ్చు. గొణిగినట్లు చెప్పవచ్చు. పెద్దగా ఆజ్ఞాపించినట్లు చెప్పవచ్చు. సౌమ్యంగా చెప్పవచ్చు. కోపంగా గూడ చెప్పవచ్చు. అరచినట్లు చెప్పవచ్చు. సంకేతంగా చెప్పవచ్చు.

ఒక్కొక్కప్పుడు గురువు సంజ్ఞలద్వారా చెప్పవచ్చు. కనుసైగల ద్వారా చెప్పవచ్చు, చేతల ద్వారా చెప్పవచ్చు.

వారి ఆజ్ఞలు కొన్ని కఠినంగా వుండవచ్చు. కొన్ని ఎంతో సులభంగా ఆచరించగలిగేవిగా వుండవచ్చు.

ఆదేశాలు అనేక రకాలు – పనులు చేయమని ఆదేశించడము, సంస్కారాలు మార్చుకోవలసి వచ్చినవాటిని ఆదేశించడము, బలహీనతలను పోగొట్టుకోవలసిన వాటిని ఆదేశించడము మొ॥నవి.

ఒక్కొక్కప్పుడు యితరులద్వారా గూడ గురువు ఆజ్ఞాపించడం జరుగుతూ వుంటుంది.

అయితే సద్గురువు అందరికీ ఒకే విధమైన ఆదేశాలనివ్వరు. ఒక్కొక్కరికి ఒక్కొక్క విధమైన ఆదేశాలనిస్తారు. ఒకరికే ఒకసారి ఒకటి చేయమని చెబితే, మరొకసారి అదే చేయవద్దని చెబుతారు గూడ. ఎవరి సంస్కారాలకు తగిన ఆదేశాలనివ్వడం సద్గురువు యొక్క ప్రత్యేకత.

దేహధారియై వున్న సద్గురువు యొక్క ఆదేశాలను ఆచరించడం సులభమేగాని సమాధి చెందిన గురువు యొక్క ఆదేశాలను గుర్తు పట్టేదెలా? గుర్తుపట్టినా ఆచరించడం కష్టమేమోనని కొందరికి అనిపించవచ్చు.

కానీ సశరీరులుగా వున్న గురువు యొక్క ఆజ్ఞలను పాటించడం గూడ అంత తేలికేమీ గాదు. ఎవరు ఏది చేసినా, ఏది మాట్లాడినా తమ తమ ఇష్టాయిష్టాలననుసరించే చేస్తుంటారు. అలా ఇష్టాయిష్టాలు పనిచేయడం వల్ల గురువు యొక్క ఆజ్ఞలో గూడ తమకు ఇష్టమైన వాటినే చేస్తుంటారు.

సద్గురువు యొక్క సన్నిధిలో వున్నవారైనా, లేనివారైనా అలాగే ప్రవర్తించడం జరుగుతూ వుంటుంది. గురు సన్నిధిలో వున్నవారు నిరంతరం ఆయన వల్ల జరిగే లీలలను చూస్తున్నప్పటికీ, ఆయన మహిమ తెలుస్తూ వున్నప్పటికీ ఆయన ఆజ్ఞలను – తమకు ఇష్టంలేని వాటిని – పాటించకపోవడం జరుగుతూ వుంటుంది. కారణం – గురువు గంభీరంగా వుండక మామూలు వ్యవహారాలలోను, కొన్ని సందర్భాలలో యితరుల సలహాలను స్వీకరించేవారుగాను, కొన్ని సందర్భాలలో ఇతరుల మాటలను వినేవారుగాను, ఇంకొన్ని సందర్భాలలో ఏమీ తెలియనివారుగానూ వుండడం వల్ల వారి సర్వజ్ఞత్వము, సర్వశక్తిమత్వము వారి సన్నిధిలో

వున్నవారి మనసులలో మరుగున పడిపోతాయి. అందువలన వారికి గురువు పట్ల చనువు ఏర్పడుతుంది.

మొదట్లో వున్న భయము, వినయ విధేయతలు కొరవడతాయి. వారి అంతటి మహనీయులతోనూ మామూలు వ్యక్తులతో వలెనే చనువుగా మాట్లాడడం జరుగుతూంటుంది. అందుకని పెద్ద విషయాలలోనే గాక, చిన్న విషయాలలో గూడ వారి ఆదేశాలను తమ ఇష్టాలకు వ్యతిరేకంగా వుంటే ఆచరించకపోవడం జరుగుతూంటుంది.

అసలు గురువు యొక్క ఆజ్ఞలను ఎందుకు పాటించాలి? అన్నింటినీ పాటించడం అవసరమా?

ఈ ప్రశ్నకు సమాధానం అసలు ఆయనను ఎందుకు ఆశ్రయిస్తున్నామో, సేవిస్తున్నామో తెలిస్తేగాని అర్థంగాదు. ఆయనను ఆశ్రయించినప్పటికీ మనం వారి ఆదేశాలను పాటించకతప్పదు. అలా లౌకిక కోరికలకోసం వారిని ఆశ్రయించినప్పటికీ వారి ఆదేశాలను పాటించలేకపోవడం గూడ మహాత్ముల చరిత్రలలో చూడవచ్చు.

ఏ విషయంలోనైనా విలువ తెలిస్తేగాని దానిని మనస్ఫూర్తిగా పాటించలేము. అలాగే సద్గురువు యొక్క మహిమ, వారి వాక్కులలోని విలువ, ప్రభావము తెలిస్తేగాని ఆయన ఆజ్ఞలను ఆచరించలేము. వారు మామూలుగా మాట్లాడినట్లు అనిపించిన ఆదేశాలలోనైనా సరే మనకు ఎంతటి శ్రేయస్సు ఇమిడి వుంటుందో మొదటగా మనకు అర్థంకావాలి. అందుకు ఆయన చరిత్రలో మనకు లభించిన సంఘటనలను స్మరించుకోవడం అవసరం. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు నిరంతర సాయిలీలల స్మరణ వల్ల సాయి యొక్క ఔన్నత్యము మనకు అవగతమై ఆయనపట్ల భక్తిశ్రద్ధలు పెరిగి ఆయన మాటలయందు విశ్వాసం పెరుగుతుంది. అప్పుడు అన్ని విషయాలలోనూ ఆయన చెప్పినట్లు ఆచరించగలుగుతాము.

సద్గురువు యొక్క ఆజ్ఞల ప్రకారం నడుచుకుంటే ఎలా వుంటుందో, ఆచరించకపోతే ఎలా వుంటుందో, ఏమి జరుగుతుందో శ్రీ సాయి లీలామృతములో మనకు ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. సందర్భానుసారంగా మచ్చుకు కొన్నింటిని మనమిక్కడ స్మరించుకుందాము.

సద్గురువు తమ వద్దకు లౌకిక కోరికల కోసం వచ్చేవారికైనా, పారమార్థికత కోసం వచ్చేవారికైనా – వారి కోరికలు తీరుస్తూనే వారి వారి స్థాయిని బట్టి, పరిపాకాన్ని బట్టి వారికి తగిన ఆదేశాలనిచ్చి, వారిని పారమార్థికత వైపుకు తీసుకువెళ్తారు. అదే వారి ప్రత్యేకత.

ఉదాహరణకు మహల్సాపతిని అతను చేసే స్వర్ణకారవృత్తిని మానుకుని, పూజారిగా వుండి, భిక్షాటనతో జీవించమని బాబా ఆజ్ఞాపించారు. అతడలాగే చేసి కృతార్థుడయ్యాడు.

అలాగే హీడాబేగ్ అనునతనిని కణాడ్ సమీపంలోని కంటోన్మెంట్ దగ్గరకు వెళ్ళమని ఆజ్ఞాపించారు. అతడాయన ఆజ్ఞానుసారం ప్రవర్తించి గొప్ప మహాత్ముడుగా రూపొందాడు. ఉపాసనీబాబాను నాలుగు సంవత్సరాలపాటు ఖండోబా ఆలయంలో వుండమనడమేగాక అలా చేస్తే తమ ఆధ్యాత్మిక స్థితినే అతడూ పొందగలడని అభయమిచ్చారు సాయి. కానీ అతడు 3–1/2 సం॥లు మాత్రమే వుండగలిగాడని అతని చరిత్ర చూస్తే తెలుస్తుంది.

అలాగే ఒకడు తనకు ఆత్మానుభూతిని ప్రసాదించమని ప్రార్థించాడు. ఇప్పుడు సమయం కాదని బాబా ఎంతగా చెప్పినా వినక తనకు అట్టి అనుభూతి అప్పుడే కావాలని పట్టుబడతాడు. బాబా అతనివైపు తమ పిడికిలి విసిరి అట్టి అనుభూతిని అతనికి ప్రసాదిస్తారు. కానీ అట్టి స్థితిని అతడు భరించలేక తిరిగి తీసుకోమని బాబాను ప్రార్థిస్తాడు. బాబా అలానే తిరిగి తీసుకుంటారు.

ఈ విధంగానే బాబా భక్తులు కోరే లౌకికమైన కోరికలను గూడ ఎన్నింటినో తీర్చేవారు. కొన్నింటిని ఆయన ప్రసాదించేటప్పుడు వారికి కొన్ని ఆదేశాలనిచ్చేవారు. కొందరు వాటిని పాటించి శ్రేయస్సును పొందేవారు. వాటిని ఉల్లంఘించిన వారు నష్టపోవడము, ఇబ్బందులు పడడమూ జరిగేది.

ఉదాహరణకు మిల్లు మేనేజరు పదవికి రాజీనామా చేసిన సదాశివ తార్కాడ్ శిరిడీలో కొంతకాలముండి తిరిగి వెళ్ళడానికి బాబాను సెలవు కోరాడు. బాబా అతనిని పూనా మీదుగా వెళ్ళమన్నారు. అట్లా వెళ్తే ఖర్చు ఎక్కువైనప్పటికీ అతడాయన ఆజ్ఞను పాటించాడు. అతనికి వెంటనే పూనాలో ఉద్యోగం వచ్చింది.

అలాగే ప్రథమంగా దర్శించిన బలరామ్ దురంధర్ కు చిలిం పీల్చమని యిచ్చారు బాబా. తన కలవాటు లేకపోయినప్పటికీ అతడు బాబా ఆజ్ఞను పాటించాడు. అతనిని బాధిస్తున్న ఉబ్బసం అప్పటితో తగ్గిపోయింది.

ఒకసారి నానా చందోర్కర్, దాసగణు శిరిడీ నుండి బయలుదేరి బాబాను సెలవుకోరారు. బాబా వారిద్దరినీ భోజనం చేసి వెళ్ళమన్నారు. కానీ భోజనం చేస్తే రైలు సమయం మించిపోయి రైలు అందదని దాసగణు భోజనం చేయకుండానే బయలుదేరాడు. బాబా చెప్పినట్లు భోజనం చేసి బయలుదేరిన నానా వెళ్ళేవరకూ రైలు రానేలేదు. బాబా మాటను ఉల్లంఘించిన దాసగణు ఆకలితోనే వుండవలసి వచ్చింది.

ఒకసారి ఒక బ్రాహ్మణుడు తన దారిద్ర్యం తీర్చమని బాబాను ప్రార్థించాడు. ఆయన ఒక పొట్లం అతనికిచ్చి, దానిని ఇంటికి వెళ్ళేవరకూ విప్పి చూడవద్దని చెప్పారు. కానీ అందులో ఏముందోనన్న కుతూహలం ఆపుకోలేక మార్గమధ్యంలోనే దానిని విప్పాడు. అందులో మాంసపు ముద్ద ఉండడం గమనించి అసహ్యంతో అతడు దానిని ప్రక్కనున్న కాలువలోకి విసిరేసాడు. అతడు చూస్తుండగానే ఆ మాంసపు ముద్ద బంగారంగా మారి నీటిలో మునిగిపోయింది!

అలానే దీక్షిత్ బాలాభాటే కుమార్తెకు మంచి పెళ్ళి సంబంధం తెస్తాడు. బాబా వద్దంటారు. అయినా అతడు మళ్ళీ మళ్ళీ అడగడంతో బాబా, "అయితే యిచ్చి చేసుకో ఫో! ఏడ్చుకో!" అంటారు. బాబా ఆదేశాన్ని పట్టించుకోక ఆ పెళ్ళి జరిపిస్తారు. ఆరు నెలలలోపే ఆ పెళ్ళికొడుకు మరణిస్తాడు.

పెద్ద విషయాలలోనే గాదు, చిన్న చిన్న విషయాలలో గూడ ఒక్కొక్కప్పుడు బాబా మాటలు అంతగా పట్టించుకోకపోవడం వల్ల గూడ కొందరు భక్తులు ఇబ్బందులకు గురయ్యేవారు.

ఉదాహరణకు ఒకసారి తాత్యా జజూరి వెళ్ళి వస్తానంటే బాబా "ఎందుకంత బాధ! వద్దు", అన్నారు. కానీ అతడు చనువు వల్ల ఆయన మాటలు పట్టించుకోక వెళ్ళి గుర్రపుబండి తలక్రిందులవడం వల్ల దెబ్బలు తగిలి బాధతో వెనుకకు తిరిగి రావలసి వచ్చింది.

అలాగే ఒక మేకను నరకటానికి బాబా కత్తి తెమ్మని చెప్పినప్పుడు, నరకమని ఆజ్ఞాపించినప్పుడు కొందరు అలా చేయకపోవడము, మరికొందరు అలా చేయడానికి సంసిద్ధులవడము బాబా చరిత్రలో చూస్తాము.

దీనిని బట్టి గురువు సశరీరులై వున్నప్పుడు గూడ ఆయన ఆజ్ఞలను పాటించడం అంత తేలిక కాదనిపిస్తుంది. గురువు సశరీరులుగా వున్నప్పుడే వారి ఆజ్ఞలను అమలు పరచడం అంత కష్టమైతే, ఇక సమాధి చెందిన గురువు యొక్క ఆజ్ఞలను పాటించడం ఎలా? అసలు గుర్తు పట్టేదెలా? అని అనిపించవచ్చు.

కానీ సద్గురువులు సమాధి అనంతరం గూడ భక్తులకు ఆదేశాలు అందిస్తూనే వుంటారు. వారు కొందరికి సశరీరులుగా దర్శనమిచ్చి ఆజ్ఞాపిస్తారు. చునీలాల్ ఆశారామ్ భగత్ అనుభవం యిందుకు ఉదాహరణ.

సద్గురువులు దృశ్యరూపంలో కొందరికి కనిపించి ఆదేశించవచ్చు. మరికొందరికి స్వప్న దర్శనాల ద్వారా ఆదేశాలను అందించవచ్చు. ఇంకొందరికి ఇతర మహాత్ముల ద్వారా గూడా ఆదేశించవచ్చు. కొందరికి జీవితంలో జరిగే సంఘటనల ద్వారా గూడ ఆదేశాలు లభించవచ్చు.

పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీసాయిబాబాను సశరీరులుగా దర్శించలేదు. అయినప్పటికీ బాబా ఆయనకు తమ ఆదేశాలనిచ్చి ఆయన జీవితాన్ని నడిపించారు.

ఉదాహరణకు ఆయన వివాహం విషయంలో

ఆయనకు శ్రీ చీరాలస్వామి ద్వారాను, శ్రీ పాకలపాటి గురువుగారి ద్వారా, శ్రీ పురన్దలాయ్ ద్వారా ఆయనను వివాహం చేసుకోవలసిందిగా ఆజ్ఞాపించారు.

అలాగే విద్యానగర్ (నెల్లూరు జిల్లా)లో ఆయన ఉద్యోగం చేస్తున్న సమయంలో ఆయన అక్కడ నుంచి వెళ్ళిపోవలసిన పరిస్థితులు సంభవించాయి. వెళ్ళాలా, వద్దా అని ఆయన ఆలోచిస్తుండగా ఒక వ్యక్తి వచ్చి శిరిడీ ప్రసాదం ఆయన చేతిలో పెట్టి, "ఇక మీరు బయలుదేరవచ్చు" అన్నాడు. అదే బాబా ఆదేశంగా ఆయన స్వీకరించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా అంటారు: "శ్రీసాయి లీలామృతములో శ్రీసాయిబాబా యొక్క లీలలు మనమెప్పుడూ చదువుతూనే వుంటాము. అందుకని అవి మనకు తెలియకపోవడమేమీ లేదు. కానీ వాటిని మన జీవితంలో అన్వయించుకోవడమెలాగో మాత్రమే తెలియడం లేదు. సరిగ్గా తీసుకోగలిగితే మహాత్ముల ద్వారాను, వ్యక్తుల ద్వారాను, సంఘటనల ద్వారాను, పరిసరాల ద్వారాగూడ మనకు ఆయన ఆదేశము, బోధ లభిస్తూనే వుంటాయి"

ఆయన యింకా ఇలా అంటారు: "నిజానికి శ్రీసాయిబాబా సూక్తులన్నీ ఉపదేశాలే, ఆదేశాలే. ఆయన సూక్తులను ఆచరిస్తూ వెళ్తుంటే ఆయన ఆజ్ఞలను పాటించినట్లే. అప్పుడు మనం ఎంతమేరకు ఆయన సూక్తులను ఆచరిస్తామో, అంతమేరకు ఆయన అనుగ్రహం మనకు లభిస్తూ వుంటుంది."

ఇందుకు ఉదాహరణ పూజ్యశ్రీ మాస్టరుగారే! బాబా సూక్తులను ఆయన సంపూర్ణంగా ఆచరించారు.

**"పనిచెయ్యి, దేవుని నామము ఉచ్చరించు; సద్గ్రంథాలు చదువు".**

ఆయన నిరంతరం ఏదో ఒక పని చేస్తూనే వుండేవారు. సద్గంథాలు పఠిస్తూనే వుండేవారు. శ్రీసాయి నామస్మరణ ఆయనకు నిరంతరం జరుగుతూనే వుండేది.

**"ఋణానుబంధాన్ని గుర్తుపెట్టుకో, నీ దగ్గరకు ఏ ప్రాణి వచ్చినా ఆదరించు"**

ఆయన వద్దకు నిరంతరం ఎంతోమంది సమయాసమయాలు లేకుండా వస్తూనే వుండేవారు. కొందరు కొన్నాళ్ళపాటు, కొన్నేళ్ళపాటు ఆయన సన్నిధిలో వుండేవారు. ఎవరినీ ఆయన నిరాకరించలేదు. అందరినీ ఆదరించారు.

**"భూమి విత్తును ధరిస్తుంది, మేఘాలు వర్షిస్తాయి..."** అని బాబా చెప్పినట్లు ఆయన ప్రతిఫలాన్ని ఆశించక తమ కర్తవ్యాన్ని తాము నిర్వర్తించారు.

**"నిన్నెవరైనా ఏమైనా అంటే మాటకు మాట చెప్పవద్దు. ఎవడు నిందను, దూషణనూ సహిస్తాడో వాడు నాకెంతో యిష్టుడు"** అన్న సూక్తి ప్రకారం ఎవరు తమను వ్యతిరేకించినా, దూషించినా ఆయన చలించలేదు. ఓర్పుతో సహించారు.

నిజానికి మనము గూడ మన గురువైన పూజ్యశ్రీ మాస్టరుగారి ఆజ్ఞల ప్రకారమే నడుచుకోవాలని, ఆయన అనుగ్రహానికి పాత్రులము కావాలనే మనస్ఫూర్తిగా కోరుకుంటాము. కానీ ఆయన ఆజ్ఞ ఏమిటో తెలుసుకోలేకపోతాము. అర్థమైనా దానిని పాటించడమెలాగో చేతకాదు. ఒకవేళ చేతనైనా మన ఇష్టాయిష్టాలు అడుగడుగునా అడ్డు తగులుతుండడం వల్ల ఏవేవో సాకులు అడ్డమేసుకుంటుంటాము.

అలాగాక, మనకు స్పష్టంగా వచ్చిన ఆదేశాలుగాని, స్వప్న దర్శనాల ద్వారా వచ్చిన ఆదేశాలుగానీ తప్పక పాటించాలి. అంతేగాక పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన సూక్తులను గాని, శ్రీసాయిబాబా చెప్పిన సూక్తులను గానీ అమలుపరచడానికి యత్నిస్తుంటే మన మాట, ప్రవర్తన మారడం ప్రారంభిస్తుంది. అప్పుడు మన సంస్కారాలలో క్రమంగా మార్పు వస్తుంది. అప్పుడు మనం వారి అనుగ్రహానికి పాత్రులమవుతాము.

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా పూజ్యశ్రీ మాస్టరుగారి ఆదేశాలను పాటించడానికి ప్రయత్నం ప్రారంభిద్దాము. ఈ గురుపూర్ణిమ సందర్భంగా మనమిచ్చే ఈ దక్షిణకుమించినది మరేమున్నది? ●

# వార్తాలాపము

( గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 16వ ప్రసంగము

### భిన్న వృత్తితా

సదాచారం నుండి భ్రష్టుడై దురాచారుడవడం కూడా తమోగుణం కలవాని లక్షణము.

శ్లో॥ దురాచారో హి పురుషో
లోకే భవతి నిందితః ।
దుఃఖభాగీ చ సతతం
వ్యాధితోఽ ల్పాయురేవ చ॥

(మనుస్మృతి)

భావం: దురాచారము చేసేవాడు లోకంలో నింద పొందుతాడు. ఎప్పుడూ దుఃఖాలను పొందుతాడు. రోగాలతో బాధపడతాడు. అల్పాయువును పొందుతాడు.

దొంగతనము, వ్యభిచారము, మద్యపానము మొ॥న శాస్త్ర విరుద్ధములైనవి, నిందింపదగునవి అయినవి దురాచారాలు. వైదిక ఆచారము చేత సర్వమానవ ధర్మమంతా రక్షింపబడుతుంది. భ్రష్టాచారము వలన ధర్మభ్రష్టత్వము సంభవిస్తుంది.

శ్లో॥ అనభ్యాసేన వేదానాం
ఆచారస్య చ వర్జనాత్ ।
ఆలస్యాదన్నదోషాచ్చ
మృత్యుర్విప్రాంజిఘాంసతి॥

(మను)

భావం: వేదాభ్యాసము చేయకుండా ఆచారభ్రష్టుడై, సోమరితనంతో వుంటూ – అంటే కర్తవ్యము నిర్వహించడంలో ఉత్సాహము చూపించనివాడు, తినరాని పదార్థాలను భుజించే బ్రాహ్మణుడిని మృత్యువు త్వరలో చంపివేస్తుంది.

## యాచిష్ణుతా

యాచిష్ణుతా అంటే ముష్టెత్తు గుణము (అడుక్కునే, యాచించే గుణము). తాను అడగడం, ఇతరుల ద్వారా తన కోసం అడిగించడం – ఇదంతా ముష్టెత్తు గుణమే!

**శ్లో॥ మరణాత్ప్రార్థనా**
**దుఃఖమధికం హి వివేకినః।**
**క్షణికం మరణాదుఃఖం**
**అనంతం ప్రార్థనా కృతమ్॥**

భావం: బుద్ధిమంతునికి అంటే వివేకం కలవాడికి అడగడం (యాచించడం) చావు కంటే కూడా ఎక్కువ దుఃఖాన్ని కలిగిస్తుంది. మృత్యువు చేత కలిగే దుఃఖము క్షణికమైనది. కానీ యాచించడం వలన కలిగే దుఃఖం అంతులేనిది.

కబీరుదాసు ఇలా అన్నాడు –

**'మాంగ్‌నా మరణ సమాన్ హై,**
**మత్ కోయీ మాంగో భీఖ్;**
**మాంగ్‌నేసే మర్‌నా భలా,**
**యహీ గురు కా సీఖ్'**

అంటే 'అడుక్కోవడం చావుతో సమానం. ఎవ్వరూ యాచించకండి! అడుక్కోవడం కంటే మరణించడమే మేలు. ఇదే గురువు యొక్క పాఠం.

అంతేకాదు, అడుక్కునేవాడిని చూసి ప్రపంచం కూడా భయపడుతుంది. ఒక విద్వాంసుడు వినోదం కోసం ఏమన్నాడో వినండి:

**శ్లో॥ తృణాదపి లఘుస్తూల**
**స్తూలా దపి చ యాచకః।**
**వాయునా కిం న నీతోఽసౌ**
**మామయం ప్రార్థయేదితి॥**

భావం: గడ్డికంటే దూది తేలిక, దూదికంటే కూడా యాచకుడు తేలిక. వీడిని గాలి ఏల ఎగరేసికొని పోవడం లేదు? తనను కూడా యాచిస్తాడేమోనని!

వాయువు కూడా యాచకుడిని తీసుకుపోయినట్లయితే తనను కూడా అడుగుతాడేమోనని భయపడుతున్నదేమో! తన దగ్గర అతనికి ఇవ్వడానికి ఏమీ లేకపోవడం చేత తనను అడుగుతాడేమో అనే భయం చేతనే వాయువు ఆ ముష్టివాడి దగ్గరకు పోవడం లేదు.

'తన కోసం యాచించడం నిందింపదగినది. కానీ పరోపకారం కోసం గాని, ధర్మకార్యాల కోసం గాని యాచిస్తే తప్పేముంది' అనే ప్రశ్నకు సమాధానం శాస్త్రవేత్తలిలా చెప్పారు:

**శ్లో॥ స్వార్థం ధనాని**
**ధనికాత్ప్రతిగృహ్ణతో యద్**
**ఆస్యం భజేత్**
**మలినతాం కిమిదం విచిత్రమ్।**
**గృహ్ణన్ పదార్థమపి వారినిధేః**
**పయోఽపి మేఘోఽయమేతి**
**సకలోఽపి చ కాలిమానమ్॥**

భావం: ధనికుని దగ్గర నుంచి తన స్వార్థానికి ధనాన్ని తీసుకున్నవాడికి ముఖము మలినమవ్వడంలో ఆశ్చర్యమేమిటి? ఇతరులకోసం సముద్రపు జలాన్ని సైతం తీసుకునే మేఘుడు కూడ నల్లబడుతూనే వున్నాడే!

ఈ రోజులలో అనేకచోట్ల పరోపకారానికి ధర్మకార్యాలు చేస్తున్నామని, పాఠశాలలు, అనాథ శరణాలయాలు, వైద్యశాలలు, సత్రాలు కట్టిస్తున్నామని చందాలు అడుగుతారు. ఈ చందాలు అడిగేవారు ఎదుటివారి దగ్గర ధనం వుందా లేదా అనే ఆలోచన చేయరు. ఇలా ప్రజలను బాధపెట్టి ధనాన్ని సంపాదించడం అధర్మం. ఇలా అడిగేవారిని ప్రజలు తిరస్కారంతో కూడిన దృష్టితో చూస్తారు. ఆ తిరస్కార చూపులతో అడిగేవారి ముఖకాంతి అంతరిస్తుంది.

**- సశేషం**

*(గత సంచిక తరువాయి)*

# భగవాన్ శ్రీ భరద్వాజ

***శ్రీమతి శ్రీదేవి***

## అధ్యాయం - 7

**6. శ్రీ పాకలపాటి గురువుగారు :** శ్రీ భరద్వాజగారు పాకలపాటి గురువుగారిని మొట్టమొదటగా 18-9-1966 తేదీన దర్శించారు. వైజాగ్ సమీపాన గల నర్సీపట్నం నుండి బయలుదేరి లోతుగడ్డ జంక్షన్ లో దిగి అడవిలో గం॥ 1-30 ని॥లు నడచి భీమసింగి లోని ఆశ్రమం చేరి గురువుగారిని దర్శించారు శ్రీ మాస్టరుగారు. ఆ అడవిలోని నరమాంస భక్షకులైన చెంచు, బోయ, కోయ జాతుల వారి హృదయాలలో రామభక్తిని నెలకొల్పి వారిని అనుగ్రహించారు శ్రీ గురువుగారు. శ్రీ భరద్వాజగారు గురువుగారిని దర్శించి ఎంతో ఆనందించారు. వారు భరద్వాజగారికి ఎన్నో ఆధ్యాత్మిక యోగ రహస్యాలను తెలిపారు. ఆ తర్వాత గురువుగారు భరద్వాజగారిని తమ చెంతకు పిలిపించుకొని వివాహం చేసుకొనవలసిందనీ, వివాహం వారి ఆధ్యాత్మిక జీవితాన్ని ఏ మాత్రం ఆటంకపరచదనీ ఆదేశించారు.

శ్రీ గురువుగారు తాము దేహత్యాగం చేయబోతున్న కొంతకాలానికి ముందుగా భరద్వాజగారి అన్నగారైన శ్రీ కృష్ణమాచార్యులుగారితో "మీ తమ్ముడు భరద్వాజ నాకు శంఖు చక్రాలతో విష్ణురూపంలో స్వప్నంలో కన్పించాడు. అతనిని చూడాలని వున్నది. వెంటనే పిలిపించండి" అని చెప్పి తమ వద్దకు పిలిపించుకొన్నారు. ఆ సమయంలో మాస్టరుగారితో ఎన్నో నిగూఢమైన ఆధ్యాత్మిక విషయాలను మాట్లాడారు.

ఈ విధంగా మహిమాన్వితుడైన శ్రీ పాకలపాటి గురువుగారి ప్రత్యేక ప్రేమాదరణలకు పాత్రులైనారు, దత్త స్వరూపులయిన శ్రీ భరద్వాజగారు.

**7. అవధూత శ్రీ వెంకయ్య స్వామి :** నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకాలోని నాగుల వెల్లటూరులో- సోంపల్లి పెంచలయ్య, పిచ్చమ్మ దంపతులకు ప్రథమ సంతానమే శ్రీ వెంకయ్యస్వామి. 20 సం॥ల వయస్సు నుండే ఆయనలో మార్పు వచ్చి, 'చాకలి యోగం, జక్కలయోగం, మంగలి యోగం' అని వీధులలో అరుస్తూ పరుగెత్తుతుంటే ఆయనకు పిచ్చి పట్టిందని భావించిన ప్రజలు 'పిచ్చి వెంకయ్య'గా పిలిచేవారు. కానీ కొన్నాళ్ళకు ఆయనలో వ్యక్తమవుతున్న మహిమలు చూసి ఆయనను అవధూతగా గుర్తించారు. గొలగమూడిలో స్వామి ఆశ్రమనివాసి అయ్యారు - సాయిబాబా వలెనే వీరూ ధునిని నిర్వహించేవారు.

శ్రీ భరద్వాజగారు విద్యానగర్ లో వుండగా సం॥1975 శివరాత్రి నాడు ఉదయాన్నే పూజ చేసుకున్న తర్వాత వెంటనే వీరి దర్శనానికి వెళ్ళాలని భరద్వాజగారికి తీవ్రంగా అన్పించింది. శ్రీ వెంకయ్య స్వామి భక్తుడు, భరద్వాజగారి విద్యార్థి అయిన బి. రామకృష్ణారెడ్డి "ఆయన గొలగమూడిలో వున్నారో లేదో తెలుసుకొని వెళ్ళటం మంచిది" అన్నాడు. భరద్వాజగారు

ఆనాటి ఉదయం గం॥8.30ని॥లకు సాయిబాబాకు అగరుబత్తి సమర్పించి స్వామి దర్శనం కలగాలని ప్రార్థించారు. వీరు గొలగమూడి చేరగానే వీరికి తెలిసిన విషయం - శ్రీ వెంకయ్యస్వామి వారు నాలుగు రోజుల క్రిందట నెల్లూరులోని దత్తాత్రేయ మఠానికి వచ్చారు. వారక్కడ పది రోజులుంటామని చెప్పటంతో వారు నిర్వహించే నిత్యాగ్ని హోత్రానికి భక్తులు కట్టెలు కూడా సిద్ధం చేశారు. కానీ వారు ఆరోజు ఉదయం గం॥ 8.30 ని॥లకు ఉన్నఫళంగా గొలగమూడి బయలుదేరారు. వారి సేవకులందరూ తలొక వైపు వెళ్ళటం వలన వారిని గుఱ్ఱపు బండిలో గొలగమూడికి పంపారు.

భరద్వాజగారు, రామకృష్ణారెడ్డి గొలగమూడి వెళ్ళేసరికి స్వామి గ్రామంలోని ఆరు బయట ప్రదేశంలో ఒక్కరే కూర్చొని వున్నారు. ఆయన నెమ్మదిగా అస్పష్టంగా తమలో తాము ఏదో గొణుక్కుంటున్నారు. ఆ ప్రక్కగా వున్న కుటీరం నుండి ఎవరో సేవకుడు వచ్చి "స్వామీ! వాళ్ళెవరో కొత్త వాళ్ళు వచ్చారు. వాళ్ళకేదైనా చెప్పరాదా!" అన్నాడు. స్వామి, "వాళ్ళేమీ చెప్పించుకోడానికి రాలేదు. ఆయన కోరేదేమీ లేదు. చూద్దామని వచ్చారు. కూర్చోనీ!" అన్నారు స్వామి. నెల్లూరు దత్తాత్రేయ మఠంలో స్వామి పది రోజులు వుంటారని విన్న భక్తులంతా అకస్మాత్తుగా నాలుగు రోజులకే గొలగమూడి వచ్చారని తెలియక నెల్లూరులోనే వున్నారని భావించారు. అందువలన గొలగమూడిలో స్వామి సన్నిధిలో వీరిద్దరే వుండటం వలన వీరు ఆరు గంటలు ప్రశాంతంగా గడిపారు. స్వామి భరద్వాజగారిని ప్రత్యేకంగా ఆశీర్వదించి ఎన్నో నిగూఢమైన విషయాలు మాట్లాడారు.

భరద్వాజగారు తమ వద్దకు వచ్చే వారినందరినీ శ్రీ వెంకయ్యస్వామిని దర్శించుకొమ్మని చెప్పేవారు.

1980వ సం॥ సెప్టెంబరు 30వ తేదీన స్వామి అకస్మాత్తుగా తమ భక్తుడైన మాకాని వెంకట్రావుగారితో "విద్యానగర్ బయలుదేరుదామయ్యా!" అన్నారు. అపుడు వెంకట్రావుగారు, గురవయ్య, డ్రైవరు మస్తానయ్య, స్వామిని కారులో ఎక్కించుకొని విద్యానగర్ వచ్చారు.

నేను దర్శించిన మహాత్ములు-4

# అవధూత శ్రీ వెంకయ్య స్వామి



పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

కొత్తచోట ఎక్కడైనా ఒక్కరోజులో వెళ్ళిపోదామని గొడవ చేసే స్వామి విద్యానగర్ సాయి మందిరంలో నాల్గు రోజులు ఎంతో ఆనందంగా, ప్రశాంతంగా గడిపారు.

"సూర్యచంద్రాదులున్నంత వరకు యీ మందిర ప్రభావం వుంటుంది" అన్నారు స్వామి. తమకు అక్కడ ఎంతో బాగుందని చెప్పారు. భక్తులందరితో కలసి సాయి భజన చేశారు. భజన జరుగుతున్నపుడు తమ చేతులు తట్టుతూ భజన చేసి అందర్నీ సాయి భజన చేయమన్నారు.

శ్రీ భరద్వాజగారినీ, వారి శిష్యులనూ, అక్కడున్న భక్తులందర్నీ ఆశీర్వదించి 5వ రోజున స్వామి గొలగమూడి తిరిగి వెళ్ళారు.

- సశేషం

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి రాజసులోచన**

శ్రీమతి రాజసులోచనగారు పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లిగారితో ఉన్న అనుబంధాన్ని, వారి లీలావైభవాన్ని ఎంతో భక్తిపూర్వకంగా, భావోద్వేగంగా ఈవిధంగా తెలియజేస్తున్నారు.

నేను విద్యానగర్ కళాశాలలో చదువుతున్న రోజులలో పూజ్యశ్రీ మాస్టరుగారి విద్యార్థినిని. 1975లో పూజ్యశ్రీ మాస్టరుగారికి వివాహమైన తరువాత పూజ్యశ్రీ అమ్మగారితో అనుబంధం ఏర్పడింది. అప్పటినుంచి ఇప్పటివరకూ ఆ గురుదంపతుల కృపవలన వారి సాంగత్యాన్ని పొందే భాగ్యం కలిగింది. ఆ రోజులలో అప్పుడప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు వారి ఇంట్లో వుండే అదృష్టం కలిగింది. స్వతహాగా నాకు ఎక్కువగా చొచ్చుకుపోయే గుణం వుండేది కాదు. ఇంట్లో పని కూడా అంతగా వచ్చేది కాదు. పూజ్యశ్రీ అమ్మగారే ప్రతిదీ నాకు నేర్పించారు.

## మా పిల్లల పట్ల వారి అసమాన ప్రేమ

1979 లో మాకు వివాహం జరిగింది. మా శ్రీవారు విజయకుమార్ గారు కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి విద్యార్థే. మాకు ఇద్దరు అబ్బాయిలు. వారిని పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా వారి పిల్లలతో సమానంగా చూసుకున్నారు. ప్రతి వేసవి సెలవుల్లో మా కుటుంబమంతా ఒంగోలుకి వెళ్లేవారము. పూజ్యశ్రీ అమ్మగారు మా పిల్లలకు ఏది ఇష్టమైతే అది వండించి పెట్టేవారు. పిల్లలు ఎంతో స్వేచ్ఛగా ఆడుకునేవారు. బాగా అల్లరి కూడా చేసేవారు. అయినా వేదమ్మ, ద్వారకబాబుగారితో సహా వారిని ఎవరూ ఏమీ అనేవారు కాదు! మా చిన్నబ్బాయి శివ పుట్టినరోజు, వేదమ్మ పుట్టినరోజు ఒకే తేదీన కావడం వల్ల పూజ్యశ్రీ అమ్మగారు వేదమ్మకి ఇష్టమైన పదార్థాలతో పాటు శివకి ఇష్టమైనవి కూడా చేయించేవారు. మా పెద్ద అబ్బాయి సాయి అమెరికా వెళ్తున్నప్పుడు నాకంటే ఎక్కువగా శ్రద్ధ తీసుకుని వాడిని పంపించారు. వాడి పిల్లలకు పేర్లు కూడా పూజ్యశ్రీ అమ్మగారే పెట్టారు. అందరి పట్లా అంత ప్రేమ, శ్రద్ధ చూపించేవారు పూజ్యశ్రీ అమ్మగారు.

## అమ్మగారి దానగుణం

పూజ్యశ్రీ అమ్మగారి దానగుణం గురించి ఎంత చెప్పినా తక్కువే! చాలామందికి పాఠశాల, కళాశాల రుసుము కట్టేవారు. బాగా ఆర్థిక ఇబ్బందులతో ఎక్కడో వున్న కుటుంబాలకు ఎన్నో సంవత్సరాల పాటు ప్రతినెలా డబ్బులు పంపించేవారు. వారు తరచూ రావడం కానీ, కనీసం ప్రత్యేక కార్యక్రమాలకు రావడం కానీ చేయకపోయినా ఏమీ పట్టించుకునేవారు కాదు! పైగా పూజ్యశ్రీ అమ్మగారు పంపించినట్లు వారికి తెలియనిచ్చేవారు కాదు. ఎందరో అనాథలకు ఒక్క డబ్బు రూపంలోనే కాకుండా, వస్త్రాలు, నిత్యావసరాలు కూడా అందించేవారు. ఏ సహాయం చేసినా రెండో కంటికి తెలియనిచ్చే వారు కాదు. వారి చర్యలు అంత గుప్తంగా వుండేవి.

## సెక్యూరిటీ వాళ్లు తిన్నారా?

అంతేకాదు! ఎక్కడెక్కడ ఏమి జరుగుతుందో పూజ్యశ్రీ అమ్మగారికి స్పష్టంగా తెలుసు. ఒకసారి నాగోలులో వేదమ్మగారి ఇంట్లో ఏదో కార్యక్రమం జరిగింది. అంతా పూర్తయ్యాక కార్యక్రమం బాగా జరిగిందని, అందరూ ప్రసాదాలు తీసుకున్నారనీ పూజ్యశ్రీ అమ్మగారికి ఫోన్

చేసి చెప్పాను. వెంటనే పూజ్యశ్రీ అమ్మగారు, "మనింటి ముందున్న సెక్యూరిటీవాళ్ళు తిన్నారా?" అని అడిగారు! 'అయ్యో తినలేద'ని చెప్పి వారిని పిలిపించి ప్రసాదం పెట్టాము. పూజ్యశ్రీ అమ్మగారు నాగోలుకి వచ్చిన కొత్తలో ఆ ప్రాంతమంతా చాలా నిర్మానుష్యంగా వుండేది. అందువల్ల కొంతకాలం నిలయం ఎదురుగా సెక్యురిటీని ఏర్పాటు చేశారు. ఆ రోజు మాకందరికీ వాళ్లు తినలేదని గుర్తురాలేదు. కానీ ఆశ్చర్యం!! ఆ విషయం పూజ్యశ్రీ అమ్మగారు గుర్తు చేశారు!

## మా తండ్రిగారి మరణంలో అమ్మగారి లీల

మా నాన్నగారికి ఆస్తమా వుండేది. అది కొంచెం ఎక్కువైనప్పుడల్లా నాతో, "అమ్మా! ఇంక నేను బ్రతకను, నువ్వు వచ్చేయి!" అనేవారు. నేను ఎక్కడికి వెళ్లినా పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పి బయలుదేరేదానిని. అలా మా నాన్న కబురు చేసినప్పుడల్లా పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పడం, వారు నిశ్శబ్దంగా వుండటం, నేను వెళ్లకపోవడం జరిగేది. ఒకసారి మాత్రం మా నాన్న రమ్మని కబురుచేసినప్పుడు పుజ్యశ్రీ అమ్మగారు, "బయలుదేరు!" అన్నారు! నేను బయలుదేరి వెళ్లాను. మా వూరైన మెట్టు వదలి ఎప్పుడూ రాని మా నాన్న, మా తమ్ముడి ఇంటికి విద్యానగరుకి వచ్చి, మాట్లాడుతూ మాట్లాడుతూనే గురువారం రోజున ప్రాణం వదిలేసారు!

## పారాయణ విషయంలో అమ్మగారి అప్రమత్తత

ఒకసారి రాత్రి 10 గంటలు దాటాక పూజ్యశ్రీ అమ్మగారు ఫోన్ చేసి, "ఏమి చేస్తున్నావ్?" అని అడిగారు. నిద్రపోయానని, ఫోన్ శబ్దానికి లేచాననీ చెప్పాను. "సరే పడుకో!" అన్నారు. ఫరావాలేదమ్మా, మెలకువ వచ్చేసింది, ఎందుకు ఫోన్ చేశారో చెప్పమంటే, పడుకొమ్మని ఫోన్ పెట్టేశారు! నాకు తరువాత చాలాసేపటివరకు నిద్ర పట్టలేదు. ఇంతలో నేను ఆరోజు పారాయణ చేయలేదని గుర్తుకొచ్చింది. వెంటనే పారాయణ పూర్తి చేశాను. అప్పుడు అర్థమైంది! పూజ్యశ్రీ అమ్మగారు ఎందుకు నిద్రలేపారో!!

## పూజ్యశ్రీ అమ్మగారి వాత్సల్య హస్తం

మేము కొంతకాలం విద్యానగర్ లో వున్నాము. అప్పుడే నాకు, మావారికీ టి. ఎం. అడ్వాన్స్డ్ కోర్స్ బోధించడానికి అమెరికా వెళ్లే అవకాశం వచ్చింది. వాటికి సంబంధించిన ఆలోచనలు, వేరే కుటుంబసమస్యలతో తల చాలా భారంగా వుండి, చాలా ఇబ్బందిగా వుండేది. అటువంటి పరిస్థితులలో పూజ్యశ్రీ అమ్మగారు ఒకసారి ఒంగోలుకి రమ్మని ఫోన్ చేశారు! నేను వెళ్ళలేదు!! అలా రెండు, మూడు సార్లు ఫోన్లు చేయించాక బయలుదేరాను. ఒంగోలు వెళ్లిన వెంటనే పూజ్యశ్రీ అమ్మగారికి పాదాభివందనం చేయగానే, వారు నా తలపైన చేయివుంచి ఆశీర్వదించారు. వెంటనే ఎన్నోరోజులుగా మోస్తున్న తల భారమంతా తగ్గిపోయి, విపరీతమైన శాంతి లభించింది! నా బాధను నివారించడానికే పూజ్యశ్రీ అమ్మగారు రమ్మని కబురుచేశారన్నమాట!

## మహా సమాధి ముందు హెచ్చరిక

ఇలా ఎన్నో, ఎన్నెన్నో అనుభవాలు, అనుభూతులు ప్రసాదించారు. పూజ్యశ్రీ అమ్మగారు సిద్ధి పొందేముందు నాకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో సత్సంగసభ్యులందరి మధ్యలో పూజ్యశ్రీ అమ్మగారు కూర్చుని వున్నారు. నేను కొంతదూరంలో వున్నాను. అంతదూరంలో వున్న నన్ను చూసి వారు టాటా చెప్తున్నట్లు చేయి వూపారు. నేను అక్కడినుంచే నమస్కారం చేశాను. తరువాత అలా ఎందుకు చేయి వూపారో అర్థమైంది.

మాటలకందని మధురానుభూతులతో, కాలగమనమే తెలియని ఒకానొక పారవశ్యంలో గురుదంపతుల సాంగత్యంలో రోజులు క్షణాల్లా గడిచిపోయాయి! ఆ జ్ఞాపకాలే మిగిలిన నా జీవితానికి పట్టుకొమ్మలు. ఏ జన్మలో అనుబంధమో! ఆధ్యాత్మికత అంటే అర్థం తెలియని మాకు, అ, ఆ, ల నుంచి మొదలుపెట్టి ఎన్నో జీవితాపాఠాలు నేర్పించారు. ఒక తండ్రిలా నాపై ప్రేమను కురిపించిన పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందాక, ఆ ప్రేమను పూజ్యశ్రీ అమ్మగారు భర్తీ చేశారు. ఇప్పటికీ అదేవిధంగా ప్రేమను పంచుతూ కాపాడుతున్న పూజ్యశ్రీ అమ్మగారికి నా హృదయపూర్వక శతసహస్రకోటి పాదాభివందనములు.

జై సాయి మాస్టర్!

# మాతృదేవి పంచమ ఆరాధనా మహోత్సవం

*శ్రీమతి టి. పద్మావతి*

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి పంచమ ఆరాధనా మహోత్సవాన్ని సన్నిధానము నందు అత్యంత వైభవంగా, భక్తిపూర్వకంగా జరుపుకోవడం జరిగింది. ఆరాధన 'మహోత్సవం' ఎలా అవుతుంది? పరిమితమైన మన భావనకు పరిమితమైన వారి దేహం నుంచి అపరిమితమై, విశ్వవ్యాపకమైన రోజు గనుక, ఆ సందర్భాన్ని మహోత్సవంగా జరుపుకుంటాము. సాయినాథుని చరిత్రలో "వారు దేహంతో వున్నప్పుడు కూడా శరీర పరిమితులుగా లేరు" అన్న వాక్యం పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లికి కూడా వర్తిస్తుంది. అటువంటి అనుభవాలని పూజ్యశ్రీ అమ్మగారు తమ భక్తులకి కూడా ప్రసాదించారు. తమ అవతార కార్య నిమిత్తం దివి నుంచి భువికేతెంచి, భరద్వాజ గురుదేవులతోకూడి, మనందరికీ గురుదంపతులై, ఆశ్రిత కల్పవృక్షమై, తనని ఆశ్రయించిన వారిలో ఆధ్యాత్మిక జాగృతిని కలిగించడానికి మన మధ్యలో కొలువైవున్న దేవతా స్వరూపము మన అలివేలుమంగమ్మ తల్లి!

అంతటి అవతారమూర్తి ఈ భూమి మీద నడయాడినప్పుడు, వారి సహచర్యం పొందినవారిలోను, దర్శనం చేసుకున్నవారిలోను, దర్శించుకోకున్నా వారి గురించి విన్నవారిలో కూడా, అద్భుతమైన అనుభవాలు, స్వప్న సందేశాలు పొందినవారెందరో! అంతటి దివ్య జనని సమాధి ఒంగోలు సమీపంలో గుమ్మళంపాడు గ్రామంలో, సజీవ సన్నిధై అలరారుతున్నది.

మహోన్నత పర్వదినమైన జూన్ 3వ తేదీన, సన్నిధి అంతా సర్వాంగసుందరంగా అలంకరించబడి, మామిడి తోరణాలతో, రంగవల్లులతో తీర్చిదిద్దబడింది. ఆ ప్రాంగణమంతా వుదయమే సుప్రభాత సేవలతో జాగృతమైంది. కాకడ హారతి జరిగిన పిమ్మట అభిషేక సేవ జరిగింది. అనేక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులందరూ ఎదురుచూసే దివ్య జనని మంగళ స్నానాల సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తయింది. అటు తరువాత ఆ తల్లికి నూతన వస్త్రాలంకరణ, కొన్ని నిత్యసేవలు జరిగాయి. తదనంతరము విశేషమైన పుష్పాలంకరణ జరుగుతుండగా పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ప్రియపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు ఆనాటి వుత్సవాన్ని పురస్కరించుకుని కొంతసేపు సత్సంగ ప్రవచనం చేశారు.

## గురు పుత్రుల సత్సంగము

"సకల దేవతా స్వరూపము, సకల సాధుస్వరూపము, పరిపూర్ణ దత్తావతారము అయిన సమర్థ సద్గురుడైన శిరిడీ సాయినాథుల వారి శిష్యాగ్రేసరులు, భక్తులు అయిన, అలివేలుమంగా భరద్వాజ మహారాజుల పాదపద్మములకు నమస్కారములు. పూజ్య గురుపత్ని అలివేలు మంగమ్మ ఆరాధనా మహోత్సవ సందర్భంగా వారి బిడ్డలమైన మనందరికీ సద్బుద్ధిని ప్రసాదించి సన్మార్గంలో నడిచేలాగా అనుక్షణం వారు ఆశించినట్లు,

చిత్తశుద్ధితో, త్రికరణశుద్ధితో మన జీవితాలను వారికి సేవాభావంగా నడుపుకుందుముగాక!"

"ఈనాటి వుత్సవానికి ఈ సన్నిధికి వచ్చిన వారందరికీ, అనేకానేక కారణాలవల్ల రాలేని వారందరికీ, సద్బుద్ధిని, వివేకాన్ని, అష్టైశ్వర్యాలను, ఆయురారోగ్యాలను ప్రసాదించి, క్షేమంగా, భద్రంగా సన్మార్గంలో నడిపించమని అమ్మకి ప్రార్థన!" అని ప్రార్థించి, గురు పుత్రులు తమ సత్సంగాన్ని కొనసాగించారు.

"జీవితంలో అనేక సన్నివేశాలు, అనేక వ్యక్తులు మన మనసు మీద ప్రభావం కలిగించి రకరకాల ఆలోచనలు మనకు కలిగేలా ఈ ప్రకృతి ఏర్పాటు చేయబడింది. గొప్ప మహాత్ముల గురించి, మనుషుల గురించి మనం, మన మనసు, ప్రభావితమైనంతసేపు మన జీవితం పురోభివృద్ధిలో వుంటుంది. కానీ ప్రకృతి పెట్టిన ఈ లక్షణాన్ని దురుపయోగం చేసుకొని, లేనిపోని విషయాలను ఆలోచించినంత సేపు మన మనసు పల్చబడి పోతూ వుంటుంది. అలా గాకుండా ప్రకృతితో సమన్వయపడి మనం నడుస్తూ వున్నంతసేపు, మన ద్వారా ప్రకృతిమాత, దానికి ఆధారమైన భగవంతుడు పనిచేస్తూ వుంటారు. సమన్వయం వున్నంత సేపు అశాంతి వుండదు. సమన్వయం ఎప్పుడైతే పోతుందో, ఒకలాంటి అసంపూర్ణత, ఒకలాంటి దిగులు ఒకలాంటి పేచీ ఏర్పడతాయి. ఈ పేచీ (అంటే ఈ అసంతృప్తి) వలన మనసు నిలకడగా కూర్చోదు. ఈ సమస్యను పరిష్కరించుకోవడమే ఆధ్యాత్మికత. ఇది నేర్పిన వారు మహాత్ములు. వయసు పెరిగిన కొద్దీ పేచీ తగ్గడానికి సమయం పడుతుంది. అదే చిన్న వయసులో ప్రయత్నిస్తే పేచీ రాకుండా జిజ్ఞాస వస్తుంది. ఈ సమస్యని పరిష్కరించుకోవడానికి పూజ్యశ్రీ మాస్టరుగారు అనేక విధానాలు మనకు తమ గ్రంథాల్లో తెలియజేసారు.. మనసులో పేచీని ఆపి మహాత్ముల వైపు తిప్పడాన్ని ప్రార్థన లేదా సాధన అంటారు. పేచీ తగ్గకుండా,,, ఇవి చేస్తే, చెప్పినవారు ఎంత గొప్ప వారైనా, ఎంత గొప్ప సిద్ధాంతం అయినా నిలవదు."

"చైతన్య మహాప్రభు భజన చేస్తే పరవశం వస్తుంది. మనం భజన చేస్తే ఎప్పుడు అయిపోతుందా అనిపిస్తుంది. ఏమిటి తేడా? – అంటే లోపల వున్న పేచీ తగ్గలేదు. మహాత్ములకి, మామూలుగా చెప్పే వాళ్ళకి, మాటల్లో తేడా లేకపోవచ్చు కానీ మొదటివాడు పేచీకి సమాధానం చెప్తాడు. రెండోవాడు చిలక పలుకులు పలుకుతాడు."

"తనకు ప్రకృతితో సమన్వయం రాలేదే అన్న అసంతృప్తి లోపల ఏదైతే వుందో అదే నెమ్మదిగా ఆధ్యాత్మికత వైపుకి దారి తీస్తుంది. మహర్షుల దగ్గర నుంచి పూజ్యశ్రీ అమ్మగారి దాకా ఎందరో మహనీయులు ఆధ్యాత్మికతకు ఎన్నో మార్గాలు చెప్పినా, ఆ చెప్పిన వాటిలో అన్నిటికంటే ముఖ్యమైనది, సమన్వయానికి సంబంధించిన విషయం. వారికీ ఇవే సమస్యలు, ఇదే భూగోళం, ఇదే గ్రహాలు, ఇవే నక్షత్రాలు వుంటాయి. కానీ వాళ్ళు ఎందుకు అలా వున్నారు అంటే వాళ్ళకి లోపల పేచీ లేదు కనుక. పైగా మనకి, ఈ జీవితం ఏంటో,, ఈ సమస్యలు ఏంటో,,, అసలు ఎందుకు పుట్టామో అన్న ఆలోచనలు వస్తూ వుంటాయి. అప్పుడు పేచీ బాగా ఎక్కువగా వుందని అర్థం. పేచీ లేని వాడికి నిరాశ రాదు, వుత్సాహం వస్తుంది. ఈ సమన్వయానికి, అంటే పేచీ పోవడానికి తను చేయవలసినవి అన్నీ చేశాక ఇంకా రాకపోతే అప్పుడు, 'నేను చేయవలసినవన్నీ చేసినా, ఎందుకు ఇలా వుంది, నన్ను కాపాడు తండ్రీ!' అన్న ప్రార్థన వస్తుంది. తన శక్తి సామర్థ్యాల మేరకు మొత్తం ప్రయత్నించినవాడు 'త్వమేవ శరణం మమ' అనడం వేరు, సాయంత్రం తినబోయే టిఫిను ముందే చేసుకుని ఫ్రిజ్ లో పెట్టుకుని వచ్చిన వాళ్ళు, 'త్వమేవ శరణం మమ' అనడం వేరు. నిజంగా మనకు వారు శరణ్యం కారు, మనకు మనమే! ఇలా చెప్తే సమాజంలో ఎవరూ ఒప్పుకోరు, ఇలా చెప్పకపోతే 'వారు' అంటే పూజ్యశ్రీ అమ్మగారు లాంటివాళ్ళు ఒప్పుకోరు."

"మన మీద నమ్మకంతో వారు మనకి జన్మనిచ్చారు. ఎవరెవరికి ఏ జన్మ శ్రేయస్కరమో వారికి అదే ప్రసాదించబడింది. ఇది గుర్తిస్తే ఈ ప్రకృతిని తెలిసి

నడుపుతున్నవాడు ఒకడు వున్నాడని నమ్మకం ఏర్పడుతుంది. ఇది మర్చిపోతే 'వాడికి బుర్ర లేదు, మనం ఎందుకు పుట్టాము?' అనిపిస్తుంది. వారు చెప్పిన మార్గాన్ని అనుసరిస్తూ మన జీవితానికి మనమే బాధ్యత తీసుకుంటే, దానికి మార్గదర్శకులుగా వాళ్ళు వుంటారు. భగవంతుని కృపా? స్వప్రయత్నమా? అనే ప్రశ్నకు సమాధానం 'సాయి మాస్టర్ ప్రవచనములు' అనే గ్రంథంలో గురువుగారు సమన్వయము చేసి చెప్పారు."

"కింద బాండీలో మరుగుతున్న నూనె ఒలికినప్పుడు, గబుక్కున ఎగిరి దూలాన్ని పట్టుకున్నవాడు ముఖ్యమా? దూలం ముఖ్యమా? అన్నది ప్రశ్న. దూలం పెట్టిన వాడిని అడిగితే – 'నేను అక్కడ దూలం పెట్టాను కనుక నీకు పట్టుకోడానికి ఒక ఆధారం వుంది' అంటాడు. దూలం పట్టుకున్నవాడిని అడిగితే – 'అక్కడ దూలం వున్నా నేను పట్టుకో లేకపోతే దానికి తగిన కృషి చేయకపోతే దూలం అక్కడే వున్నా వుపయోగం లేదు' అంటాడు. రెండూ తెలిసినవాడు ఏమంటాడంటే, 'పైన దూలం వుందని తెలుసుకో, పట్టుకునే ప్రయత్నం కూడా చెయ్యి' అంటాడు. మన లోపల పేచీ వుండడం వల్ల ఇలాంటి సమన్వయము మనకి కుదరటము లేదు. ఈ ఒక్క వాస్తవం గుర్తిస్తే, ఇన్ని మతాలు, ఇన్ని సాంప్రదాయాలు ఎందుకు పనిచేయటం లేదో తెలుస్తుంది."

"ఈ పేచీని అధిగమించడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి సార్వజనీనమైన మార్గం. ఇది ఋషుల దగ్గరనుండి పూజ్యశ్రీ మాస్టరుగారి దాకా అందరూ ఆచరించి చూపించారు.

రెండవది మనసును యమ నియమాలతో దృఢం చేసుకుంటూ పోవడం. మొదటిదైనా చేయొచ్చు లేదా కొంచెం గట్టి మార్గమైన రెండోది కూడా చేయొచ్చు. ఎక్కువ మందికి ఈ రెండు కలిసి వున్న మార్గం చెప్పారు. పూజ్యశ్రీ అమ్మగారు, మాస్టరు గారు ఈ లోపల పేచీకి ఎటువంటి నియమాలు ఎంతమేరకు వుపయోగపడతాయో చేసుకుంటూ చెప్పుకుంటూ వచ్చారు. జీవితంలో ఆధ్యాత్మికతకు సంబంధించిన పనులు ప్రధానంగా పెట్టుకుని నడవడం ఎలాగో చేసి చూపించారు. అంతేకాదు, ఇదే సమాజంలో, ఇలాంటి మనుషులతో, ఇవే గ్రహాలు, నక్షత్రాలతో ఇదే భూమ్మీద మనలాంటి శరీరాన్ని ధరించి మనమధ్య వారు సమన్వయంతో జీవించి చూపించినా కూడా మనం దాన్ని పొందకపోవడం వుంది చూడండి అది చాలా బాధాకరం.. మనం ఎప్పుడైతే మన మనసును మన చేతుల్లో వుంచుకొని గురుదేవులను ఆధారంగా పెట్టుకుని తల్లికి తగ్గ బిడ్డలు అవ్వడానికి ప్రయత్నం మొదలు పెడతామో ఆ రోజు వారి అవతార కార్యానికి పూర్ణత!"

"ప్రతి ఆరాధనకి నాకు ఒకటే అనిపిస్తుంది వాళ్ళు వున్నన్నాళ్ళు ఏం నేర్చుకున్నాం? పూజ్యశ్రీ అమ్మగారు శరీరం ధరించి మన మధ్యకు వచ్చి శారీరకంగా ఎంతో బాధపడ్డారు. అసలు వారికి అంత బాధ పడవలసిన అవసరం ఏముంది? వాళ్ళు నేర్పిన వుజ్వలమైన జీవితం ఏమిటి? ఎన్నాళ్ళకీ నేర్చుకొని మనమేమిటి? వారికి మన మీద వున్న నమ్మకం ఎంతటిదో!! మనకి వారి మీద వున్న నమ్మకంపై వారు ఆధారపడివుంటే,, ఇలా అవతరించరు! వారికి మన మీద వున్న నమ్మకానికి మనకోసం మన మధ్య అవతరించారు!!"

"కనుక ప్రతి దాంట్లో మనం అభివృద్ధి చెందుతూ పోవడం వారి ఆరాధనా మహోత్సవం రోజున మనకి మనం పెట్టుకునే నియమం. పూజ్యశ్రీ మాస్టరుగారు మన కోసం వారి గ్రంథాల్లో రాయని అంశమే లేదు. సాక్షాత్తు దత్తస్వరూపుడైన భరద్వాజ మహారాజు చెప్పిన అత్యద్భుతమైన నిర్వచనం – "విత్తనం చెట్టయినట్టు, మనిషి దేవుడు అవుతాడు" అని చాలా ఖచ్చితంగా చెప్పారు. ఈ జన్మలో ఇప్పుడే ముమ్మాటికి పరమార్థం సాధించవచ్చు మనం ఆయన చెప్పింది ఆచరిస్తే."

"ఈమధ్య బాబాగారిపై వీడియోలు పెట్టి యూట్యూబ్ లో ఏదో గొడవ జరుగుతోంది అని అందరూ బాధపడుతూ, మీరు సమాధానం చెప్పండి అని నన్ను అడుగుతున్నారు. నిజానికి పూజ్యశ్రీ బాబా మీద, పూజ్యశ్రీ మాస్టరుగారి మీద వీడియోలు పెట్టి ఏదో

అంటున్నా ఆ మహనీయులకేమీ కాదు. కానీ మన ఇంట్లో వారి పటాలు పెట్టుకొని వారు చెప్పింది చేయకుండా మనం బ్రతుకుతూ వుంటే, ఆ వీడియోలు పెట్టిన వాళ్ల కంటే మనం ఎక్కువ మాటలంటున్నట్లు లెక్క! కనుక మారాల్సింది మనం. ఒక్కొక్కడు ఒక్కొక్క వజ్రంలా, ఒక వివేకానందుడిలా తయారైతే, వారిని ఎవరైనా ఏదైనా అనగలరా?? ఇదే నా సమాధానం!!"

"పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధన సందర్భంగా – 'మనందరం ఎందుకు గట్టెక్కం?' అని గట్టిగా పట్టుబట్టి,,, రేపటి నుంచి చేసే ప్రతి పని ఎరుకతో చేయడం మొదలు పెట్టండి. అంటే ధ్యాస పెట్టి చేయడం. రోజంతా అలా వుండడం కుదరకపోయినా వుదయం ఐదు నిమిషాలు, మధ్యాహ్నం ఐదు నిమిషాలు, సాయంత్రం ఐదు నిమిషాలు ధ్యాసతో చేయాలి. రెండోది,,, ప్రతిరోజు స్నానం చేసేటప్పుడు 'వారి పాదజలంతో మనం స్నానం చేస్తున్నాం' అనుకొని చేయాలి. ఇది ఎట్టి పరిస్థితుల్లో మానకూడదు. ఏదైనా ఊరెళ్లినా, ఏమైనా అవాంతరాలు వచ్చినా కూడా మానకూడదు. ఆ భావన చేసుకుని స్నానం చేయాలి . అలాగే మూడవది,,, ధ్యాసతో భోజనం చేయడం. ముందు ఒక పూట భోజనంతో మొదలుపెట్టి, తర్వాత మూడు పూటలా తిన్నప్పుడు అంతా అదే ధ్యాసతో చేయాలి. మధ్యలో కూడా మిగిలిన సమయంలో అలారం పెట్టుకుని ఐదు నిమిషముల పాటు ధ్యాసతో వుండాలి. మనందరం ఒక్క సంవత్సరం అలా చేస్తే ఆ తర్వాత ప్రపంచం గురువుగారు గురించి ఏం మాట్లాడుతుందో చూద్దాం. భారతదేశంలో వున్న ప్రతి మందిరంలో గురువుగారి జయకారం మారుమ్రోగుతుంది."

"సాటిలేని సమర్థ సద్గురువైన అలివేలు మంగమ్మ తల్లి ఆరాధన సందర్భంగా వారి సంపూర్ణ ఆశీస్సులు అందరికీ వుండాలని ప్రార్థిస్తూ ఇప్పుడు భక్తితో వారికి పూజ చేసుకుందాం" – అంటూ శ్రీ ద్వారక బాబుగారు తమ సత్సంగాన్ని ముగించారు.

అనంతరం పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ప్రియపుత్రిక శ్రీమతి వేదవతిగారు ఆరాధనోత్సవంలో పాల్గొన్న భక్తులందరి తరపున పూజ్యశ్రీ అమ్మగారికి దత్తాత్రేయ అష్టోత్తర శతనామ సహిత షోడశోపచార పూజ చేశారు. తర్వాత, దివ్యజనని అనేకమంది భక్తులకు ప్రసాదించిన దివ్యలీలలను రెండు భాగాలుగా ముద్రించిన గ్రంథాలను శ్రీమతి వేదమ్మగారు, శ్రీ శ్రీకాంత్ గారు ఆవిష్కరించారు. ఆ వేడుక అనంతరం శ్రీమతి వేదవతిగారు, పూజ్యశ్రీ అమ్మగారి లీలా వైభవాన్ని అందరితో పంచుకున్నారు.

సమయం ఒంటిగంట దాటి పది నిమిషములు కావస్తుండడంతో, శ్రీ బాబుగారు "జూన్ మూడో తేదీన పూజ్యశ్రీ అమ్మగారు తన శరీరాన్ని మనకు ప్రసాదంగా వదిలిపెట్టి వారు విశ్వవ్యాపక చైతన్యంగా నిలిచిపోయారు. అది జరిగింది మధ్యాహ్నం ఒంటిగంట పన్నెండు నిమిషాలకు. ఇప్పుడు ఆ సమయం కావస్తుంది కనుక, అందరం పూజ్యశ్రీ అమ్మగారికి హారతి చేసుకుందాం. మీ ఎదురుగా పూజ్యశ్రీ అమ్మగారు వున్నారు. నిండు మనసుతో మీరు చెప్పుకోవాల్సింది చెప్పుకుంటూ వారి మీద ధ్యాస నిలిపి వేచి వుండవలసింది" అని చెప్పి, సరిగ్గా ఒంటిగంటా పన్నెండు నిమిషాలకు పూజ్యశ్రీ అమ్మగారికి హారతిని సమర్పించారు. అనంతరం "అందరూ క్రమంగా వచ్చి పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకొని ప్రసాదం తీసుకోండి. సాయంత్రం హారతి తరువాత పూజ్యశ్రీ అమ్మగారిసేవార్థం 'ప్రహ్లాద భక్త విజయం' అనే యక్షగానం ప్రదర్శించబడుతుంది. అందరూ అంతవరకు విశ్రాంతి తీసుకొని, తిరిగి ఆ సమయానికి రావాల్సింది",,, అని తెలియజేసి ఆ పూట కార్యక్రమానికి స్వస్తి చెప్పారు.

## సాయంత్రం కార్యక్రమం

సాయంత్రం సంధ్య హారతి అనంతరం శ్రీ ద్వారకనాథ్ గారు మాట్లాడుతూ,,, "పవిత్ర క్షేత్రాల్లోనూ, ఇటువంటి ప్రదేశాల్లోనూ, రోజు మొత్తములో పవిత్రమైన సమయంలోనూ మన మనసుకి ప్రాణశక్తికి సంబంధం బాగా దగ్గర అవుతుంది. భావగర్భితమైన, భక్తిప్రధానమైన కళాప్రదర్శనలు తిలకిస్తున్నపుడు మన

మనసుని ప్రశాంతంగా వదిలేసి మైమరచిపోతే, మనలో తెలియనంతగా లోతైన పవిత్రభావాలు నాటబడతాయని విజ్ఞాన వీచికలు గ్రంథంలో పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు.”

“ఈరోజు ప్రదర్శించబోయే ప్రహ్లాద భక్త విజయం, కిందటిసారి ఇక్కడ వేదమ్మగారికి నాట్యం నేర్పిన గురువుగారు వారి శిష్యులు చేత ప్రదర్శింప చేసారు. ఇప్పుడు బుజ్జి పిల్లలైన కైవల్య బృందం వారితో ప్రదర్శించబడుతుంది. ఈ బుజ్జి పిల్లలందరూ ఇది ప్రదర్శించాలి అని అనుకున్న దగ్గర నుంచి ప్రతిరోజు పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలకి, 11 సార్లు శివతాండవ స్తోత్రం చదువుతూ,,, ‘ఇది చేసేవారికి మంచి జరగాలి, చూసేవారికి భక్తి కలగాలి’ అన్న సంకల్పంతో చేశారు. చంటి పిల్లాడికి తల్లి గోరుముద్దలు తినిపించి పోషణ చేసినట్లు కళల రూపంలో అమ్మవారు ఆధ్యాత్మిక బీజాలు మనకి అందజేస్తారని శాస్త్రం! అందువల్ల చక్కగా పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో, ఈ ప్రహ్లాద భక్తవిజయాన్ని అందరు ఆస్వాదించవలసినది. ముందుగా పూజ్యశ్రీ అమ్మగారికి సేవగా పరమయ్యగారి అమ్మాయి చిరంజీవి హన్షిత ఫణి ‘అలరులుకురియగా ఆడెనదే’ అన్న నాట్య ప్రదర్శన చేయబోతున్నది” అని తెలియజేశారు శ్రీద్వారకనాథ్ గారు!

ఆ నాట్యప్రదర్శన అనంతరం ‘ప్రహ్లాద భక్తవిజయం’ లో పాల్గొనే చిన్నారులందరూ పూజ్యశ్రీ అమ్మగారి పాదపద్మములకు నమస్కరించుకొని శివతాండవ స్తోత్రం చదివి ప్రదర్శన మొదలుపెట్టారు. ఈ ప్రదర్శన మొదలు పెట్టబోయే ముందు ఆ చిన్నారులని వుద్దేశించి నాట్య గురువుగారు శ్రీ సుబ్రహ్మణ్యంగారు మాట్లాడుతూ,,,,,,

“ఇప్పటిదాకా నాట్యప్రదర్శన జరిగిన “అలరులుకురిగా ఆడెనదె” అనే కీర్తన శంకరాభరణం రాగంలో వుంటుంది. నేను దాన్ని కళ్యాణి రాగంలో వేదమ్మచేత చేయించాను. పూజ్యశ్రీ అమ్మగారు ఈరోజు ఈ కార్యక్రమం గురించి నన్ను చెప్పమని నాకు యోగ్యతాపత్రం ఇచ్చారు అని భక్తిపూర్వకంగా మనవి చేస్తూ,,, మీ అందరికీ ఒక విచిత్రం చెప్పాలి. ఈ ప్రదర్శనకి ఒక 8 ఏళ్ల పాప సూత్రధారిత్వం వహించింది. చాలా ఆశ్చర్యకరమైన విషయం ఇంత చిన్న వయసులో ఇలా చేయడం నేను ఎక్కడా వినలేదు. బహుశా ప్రపంచంలోనే మొదటిసారేమో. పైగా ఇంకొక విచిత్రం ఏంటంటే తనకంటే పెద్ద వాళ్ళందరితో సాధన చేయించింది.. ఇది ఇంకా నన్ను ఆశ్చర్యపరిచింది. కాసేపట్లో మన ముందు ఇది ఆవిష్కృతం కాబోతోంది. కిందటిసారి మేము ఇదే ప్రదర్శన ఇక్కడ చేసాం. మేమంతా ఇంటికి వెళ్లిన వారం రోజులకి ఒక వీడియో పంపించబడింది. అదేమిటంటే,,, మన కైవల్య మేము ప్రదర్శించిన ప్రహ్లాద భక్త విజయంలో ప్రహ్లాదుడు పోషించిన పాత్రను అభ్యాసం చేసి దాన్ని తాను పోషించి ఒక వీడియో తయారు చేసి నాకు పంపించింది. నేను అది చూసి చాలా ఆశ్చర్యపోయాను. ఇవన్నీ నాకు ఒక దాని నుంచి ఇంకొకటి ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఇక ఎక్కువ ఆలస్యం చేయకుండా మీరందరూ చూడబోయే ప్రదర్శన కథని టూకీగా చెప్పేస్తాను.”

“ప్రహ్లాద భక్త విజయం అనేది త్యాగరాజస్వామి వారు రచించిన యక్షగానం! ఇది చాలా తక్కువ మంది చేశారు. అసలు చేయనేలేదని చెప్పాలి. బహుశా ఇటువంటి ప్రయోగం చేసిన వాడిని నేనొక్కడినేమో! ఇది ఎందుకు ఎవరూ ప్రయత్నం చేయలేదంటే దీనిలో కేవలం భక్తి రసమే వుంటుంది. అది చాలా కష్టతరమైన ప్రయోగం. ఇక కథలోకి వస్తే,,, ప్రహ్లాదుడు అనగానే మనకి హిరణ్యకశిపుడు గుర్తొస్తాడు. కానీ ఇందులో అతని ప్రసక్తి వుండదు. ప్రహ్లాదుడికి నాగబంధం వేసి సముద్రంలో విసిరిస్తే, సముద్రుడు తన పురానికి తీసుకెళ్లి నాగబంధం విడిపించడానికి గరుడ ప్రార్థన చేసి గరుత్మంతుని పిలిపిస్తాడు. అతడు వచ్చి నాగబంధాన్ని విడిపించాక ప్రహ్లాదుడు సముద్రుడిని నా రాముని చూపించమని అడుగుతాడు. ఇక్కడ విచిత్రమేమంటే,,, రాముడ్ని చూపించు అని అడగడానికి త్యాగరాజ స్వామి ప్రహ్లాదునిలా మారిపోయి ఆయన ఆరాధ్యదైవమైన శ్రీ రాముని చూపించు అన్న పదప్రయోగం ఇక్కడ

చేసి వుండొచ్చు. సముద్రుడు రామ నామజపం చేస్తూ వుండమంటాడు. అప్పుడు ప్రహ్లాదుడు రామచింతన చేస్తూ వుంటాడు. ఆ సమయంలో నారదుడు అక్కడికి వస్తాడు. అప్పుడు ప్రహ్లాదుడు ఎప్పుడైనా మీ విష్ణుమూర్తి నన్ను తలుచుకుంటాడా? అని అడుగుతాడు. తలచుకోకేం,,,నిన్ననే నీ ప్రస్తావన వచ్చి నిన్ను కాపాడడానికి వస్తానని విష్ణుమూర్తి లక్ష్మీదేవితో చెప్పినప్పుడు, మీరు భక్తుల రక్షిస్తానని వెళ్తారు కానీ తిరిగి రావడమే చాలా కష్టం' అని ఆవిడ కొంచెం అలిగితే,, వాళ్ళ"లేదు లేదు నేను అతన్ని రక్షించి కొన్ని వరాలు ఇచ్చి వెంటనే వచ్చేస్తాను" అంటాడు. కానీ తీరా ప్రహ్లాదుడు దగ్గరికి వచ్చాక ఎన్ని ఆశలు చూపించినా ఎన్ని వరాలు ఇచ్చిన నాకు అవి ఏమీ వద్దు నన్ను వదిలి వెళ్ళద్దు అని ప్రార్థన చేస్తాడు. ఇతని భక్తి చూసి సాక్షాత్తు లక్ష్మీదేవి అక్కడికి వచ్చేస్తుంది. అప్పుడు చివరిగా రాముడు అంటాడు నువ్వు ఎక్కడ చూస్తే అక్కడ నేను కనిపిస్తాను అని. అందుకే కాబోలు తర్వాత కాలంలో స్తంభంలో కూడా భగవంతుని చూడగలిగాడు. ప్రహ్లాదుడు బంగారు పూలతో పూజ చేస్తూ శ్రీరాముని తన నివాసానికి తీసుకెళ్తాడు. ఇది మొత్తం ప్రహ్లాద భక్త విజయం యొక్క చరిత్ర" అని టూకీగా కథ చెప్పి అందులో పాల్గొనే చిన్నారులందరినీ ఆశీర్వదిస్తూ కార్యక్రమం మొదలు పెట్టమన్నారు.

దాదాపు మూడున్నర గంటలసేపు కొనసాగిన యక్షగానం ముగిసింది. ప్రేక్షకులందరూ ఆ ఆనంద పరవశం నుంచి తేలుకోలేకున్నారు. కారణం ఏమంటే ప్రహ్లాదుడిగా అభినయం చేసిన చిరంజీవి కైవల్యతో సహా మిగిలిన పాత్రలు ధరించిన చిన్నారులందరూ తమ తమ పాత్రల్లో చక్కగా ఒదిగిపోయి అక్కడ పాత్రను ధరించిన వారు కాకుండా పాత్రలు మాత్రమే అందరికీ కనిపించాయి. "ఇందుకా,,ఈ తనువు" అన్న త్యాగరాజ కృతిని చిరంజీవి కైవల్య ప్రదర్శిస్తూ కళ్ళనీళ్ళ పర్యంతమయింది, అది చూసిన ప్రేక్షకుల హృదయాలు ద్రవించి బాష్ప ధార వర్షించింది.. ఈ యక్షగానం మొదలుపెట్టేముందు శ్రీ ద్వారకనాథ్ గారు, "ఇలాంటివి తిలకించడం వల్ల అందరి హృదయాల్లో భక్తి భావాలు నాటబడతాయి" అని చెప్పినది అప్పుడు అక్షర సత్యమయ్యింది.

సుబ్రహ్మణ్యం గురువుగారు పిల్లలందరినీ ప్రశంసల వర్షంతో ముంచెత్తారు. ఈరోజు ఇక్కడ ఇద్దరు త్రివిక్రములను చూశాను. ఒకరు బుజ్జి కైవల్య, రెండవ వారు ద్వారకనాథ్. మరొక సన్నివేశం కోసం పిల్లలు వస్త్రములు మార్చుకోవడానికి వెళ్ళినప్పుడు ఆ విరామ సమయంలో ద్వారక మాట్లాడుతూ,,, నా పేరులోనే దవ్వారకడున్నాడు(ద్వారక)అని చెప్తూ,, మనందరికీ దవ్వారకుడిగా ప్రయత్నం చేస్తున్న వాడిని అని చెప్పుకుంటూ,,, ద్వారకకు దారి చూపించాడు – అంటూ అభినందనలు తెలియజేశారు

ఇక ఈ యక్షగానంలో పాల్గొన్న పాత్రధారులకు, వారికి సహాయకులుగా వ్యవహరించిన వారికి, కార్యక్రమం ప్రారంభంలో అలివేలుమంగమ్మపై కీర్తన నాట్య ప్రదర్శన చేసిన చిరంజీవి హన్షిత ఫణికి, సుబ్రహ్మణ్య గురువుగారి ద్వారా అమ్మగారి లీలా వైభవం గ్రంథాలు, యోగ్యతాపత్రాలు ఇవ్వడం జరిగింది. అప్పుడు మరొక నాట్య గురువు గారు శ్రీమతి శివకుమారిగారు మాట్లాడుతూ,, "భక్తిరసం, అలాగే హాస్యరసం పండించడం చాలా కష్టం. ఈ పిల్లలందరూ వారి పాత్రలకు తగ్గ అభినయం చేస్తూ అత్యద్భుతంగా భక్తిరసాన్ని పండించారు" – అంటూ ఇంత చిన్న వయసులో భక్తి ప్రధాన యక్షగానాన్ని ప్రదర్శించిన చిన్నారుల బృందానికి అభినందనలు తెలియచేసారు.

అత్యద్భుతంగా, భక్తిరంజకంగా 'ప్రహ్లాద భక్త విజయం' మనందరికీ కనువిందుగా, హృదయం నిండుగా ప్రదర్శించిన పిల్లలందరికీ మరొకసారి కరతాళధ్వనులతో,,,హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుందాం అని చెప్తూ,,, పూజ్యశ్రీ అమ్మగారికి మంగళహారతినిచ్చి ఆరోజు కార్యక్రమానికి స్వస్తి పలికారు శ్రీ ద్వారకనాథ్ గారు!! ●

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీ గుండాల జలంధర్, బెంగుళూరు

సమర్థ సద్గురు సాయినాథులవారు నా పిన్న వయసులోనే నా జీవితంలో ప్రవేశించి, నన్ను వారి కృపకు పాత్రుణ్ణి చేశారు.

మా స్వస్థలం తిరుపతి. మా నాన్నగారు ప్రతిరోజు ఉదయమే తిరుపతిలో ఉన్న శ్రీ గోవిందరాజుల గుడి, శ్రీ రాములవారి గుడి, శ్రీ కాళీమాత గుడి ఇలా అన్ని దేవుళ్ళ గుళ్ళకి వెళ్లి దర్శనం చేసుకునేవారు. నా చిన్నతనంలో తనతో పాటు నన్ను కూడా ప్రతిరోజు తీసుకెళ్లేవారు. అలా నాన్నగారితో నాకు ఉదయమే గుడికి వెళ్లి దర్శనం చేసుకోవడం అలవాటయింది. ప్రత్యేకించి ధనుర్మాసంలో అయితే ఉదయమే కట్ పొంగలి, చక్ర పొంగలిలాంటి ప్రసాదాలు వేడివేడిగా తయారుచేసి పెట్టేవారు. ఆ ప్రసాదాలు అంటే నాకు చాలా ఇష్టం. అందుకని నాన్నగారితో పాటు తప్పకుండా నేనూ వెళ్లేవాడిని.

నేను 9వ తరగతి చదువుతున్నప్పుడు మా పక్కింటివాళ్ళ ద్వారా, ఇంట్లోనే డాబా మీద కట్టుకున్న బాబా గుడికి వెళ్లాను. అప్పట్లో తిరుపతిలో బాబా గుళ్ళు చాలా తక్కువ. అక్కడ కూడా ప్రసాదాలు బాగా పెడతారని తెలిసి వెళ్లాను. అక్కడ వాళ్ళు బాబావారి సమాధి మందిరం ఫోటో పూజలో పెట్టారు. ఆ ఫోటో చూడగానే కళ్ళు తిప్పుకోలేనంతగా ఆకర్షితుడనయ్యాను. ఆ చిన్న వయసులో ఆయన మీద ప్రేమ, గౌరవం, ఇష్టం అన్నీకలగలిపి మాటల్లో చెప్పలేని ఒక భావన నా మనసులో వారిపట్ల వుండేది. ప్రతిరోజూ వారిని చూడాలి



అనిపించేది. కానీ, ఇంట్లోనే గుడి ఉండడం వల్లనేమో వాళ్ళు గురువారం ఒక్కరోజు మాత్రమే అందరినీ రానిచ్చేవారు. తరవాత ఇంకొకచోట బాబాకి చాలా పెద్దగుడి కట్టారు. ఇక ప్రతిరోజూ అక్కడకి వెళ్లడం మొదలుపెట్టాను.

కొన్నాళ్లకి ఆ గుడి నుంచి ఒక చిన్న బాబా విగ్రహం తెచ్చుకొని ప్రతిరోజూ ఇంట్లో అభిషేకం చేసుకునేవాడిని. నన్ను ఇంట్లో వాళ్ళు చాలా చిత్రంగా చూసేవారు. నాన్నగారు అంత పట్టించుకోలేదు కానీ అమ్మ మాత్రం, "మన రాముడు, కృష్ణుడు లాంటి దేవుళ్ళ

పక్కన ఆ ముసలాయాన్ని కూడా పెట్టావేమిటి? ఆయన దేవుడని నీకెవరు చెప్పారు నాన్నా? పైగా అభిషేకం కూడా చేస్తున్నావు, ఇదేం పిచ్చి?" అనేది. కానీ నేనేమీ పట్టించుకోకుండా ప్రతిరోజూ అభిషేకం చేసుకునేవాడిని. నెమ్మదిగా మా నాన్నగారిని కూడా అన్ని దేవుడి గుళ్ళల్లో దర్శనాలు అయ్యాక, బాబా గుడికి రమ్మనేవాడిని. ముందు అంతగా ఇష్టపడకపోయినా తరవాత ఆయన కూడా బాబా గుడికి వచ్చేవారు.

ఒకరోజు హారతులు పాడటం నేర్చుకుందామని హారతి పుస్తకం తీసుకున్నాను. వెనక్కి తిప్పేసరికి ఒకాయన ఫోటో వుంది. ఆ ఫోటో చూడగానే వారికి నాకూ ఏదో తెలియని అనుబంధం ఉందనిపించింది.. ఈయన మహాత్ముడే అయి వుంటారు, వీరిని గురించి తెలుసుకోవాలి అనుకునేవాడిని. తరవాత తెలిసింది ఆయనే పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరు గారు అని!!

నా డిగ్రీ పూర్తి అయిన తర్వాత ఎం.సీ.ఏ. చేయడానికి బెంగళూరుకు వచ్చాను.. "వెళ్ళేది కొత్త ప్రదేశం, అక్కడ ఏమీ తెలియదు, నువ్వే నాకు తోడుండాలి" అని బాబాకి చెప్పుకొని బయలుదేరాను. అప్పుడు అమ్మ నా గురించి బెంగ పెట్టుకుంది. కొత్త ప్రాంతములో నేనెలా ఉంటానో అని. బాబా నన్ను చూసుకుంటారని ధైర్యం చెప్పేవాడిని. అక్కడ కొన్ని పరిస్థితుల వల్ల నేను రెండు మూడుసార్లు నా రూము మార్చవలసి వచ్చింది. నేను ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ దగ్గరగా బాబా గుడి ఉండేది. ఇవన్నీ చూసి మా అమ్మకి కూడా బాబావారి మీద నమ్మకం కలిగింది. తరవాత నాకు బెంగుళూరులోనే ఉద్యోగం వచ్చింది. చాలాసార్లు ఆర్థిక పరిస్థితుల్లో అస్తవ్యస్తత ఏర్పడినా బాబావారే వాటన్నింటినీ చక్కదిద్ది నన్ను నిలబెట్టేవారు. ఆ విధంగా ఎల్లప్పుడూ నాకు తోడునీడగా ఉండి ఇప్పటికీ కాపాడుతున్నారు నా సాయినాథులు.

మనందరి జీవితాల్లో ప్రకృతి కరోనా రూపంలో విలయతాండవం చేసింది. దానికి ఎన్నో జీవితాలు బలైపోయాయి. మాకు కూడా అదే పరిస్థితి ఎదురైనా బాబా దయతో రక్షింపబడ్డాము. మా నాన్నగారికి, మా చుట్టాలలో కొంతమందికి కరోనా వచ్చింది. అందరూ ఆసుపత్రిలో చేరారు. కొన్నాళ్లకి మా బాబాయి ఆసుపత్రిలోనే కాలం చేసారు. నాన్నగారికి ఊపిరితిత్తుల వ్యాధి ఉండేది. కరోనా రావడంతో పరిస్థితి విషమించింది. అప్పుడు నేను బాబాతో, "నాన్న ఆసుపత్రిలో ఉండగా ఎటువంటి దారుణం జరగకుండా చూడండి. ఆయన ఆరోగ్యం నయమై ఇంటికి వచ్చినతర్వాత కావాలంటే ఆయనని తీసుకువెళ్ళండి, ఆయనకి ఉత్తరక్రియలు అన్ని మా సమక్షంలో జరిగేలాగా మీరు అనుగ్రహించండి, ఆయన రోజూ మీ గుడికి కూడా వచ్చి, మీ దర్శనం చేసుకునేవారు కదా" అని ఏడుస్తూ ప్రార్థన చేసేవాడిని. నిరంతరం సాయి నామం చేసుకోమని నాన్నగారికి చెప్పేవాడిని. అయితే ఆయనకి రాముడు అంటే చాలా ఇష్టం. అందువల్ల సాయికి రాముడ్ని కలుపుకుని "సాయిరాం సాయిరాం" అని నామస్మరణ చేసుకునేవారట. చివరకు బాబా దయవల్ల కొన్నాళ్లకి వ్యాధి తగ్గి నాన్న ఇంటికి వచ్చారు. ఆ తరువాత రెండు సంవత్సరాలకి మా అందరి సమక్షంలోనే మా నాన్నగారు బాబా సన్నిధి చేరారు. అలా నా కోరిక, మా నాన్నగారి కోరికా కూడా తీర్చి అనుగ్రహించారు బాబా!!

ఇక నా వైవాహిక జీవితంలో ముఖ్య భాగమైన నా అర్ధాంగి శ్రీమతి లక్ష్మి కూడా బాబా సంప్రదాయాన్ని అనుసరిస్తుంది. అందుకే అనుకుంటాను మా బాబు సాయిదీప్ కి కూడా బాబా అంటే చాలా ఇష్టం. వాడు ఇప్పుడు 9వ తరగతికి వచ్చాడు.

మా అబ్బాయి గర్భంలో వున్నప్పుడు చాలాసార్లు వాళ్ళ అమ్మకి ప్రమాదాలు జరిగాయి. కానీ అన్నిటినుండి ఇద్దరినీ సురక్షితంగా కాపాడారు బాబా. ప్రసవం కూడా చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో జరిగింది. ప్రసవ సమయానికి నెల రోజుల ముందే నా భార్యని వాళ్ళ పుట్టింటికి పంపించాను. వాళ్ళ ఊరు చేరుకున్న వెంటనే తనకి కొంచెం ఇబ్బంది అయ్యి తక్షణమే ఆసుపత్రిలో చేర్చారు. అప్పుడున్న పరిస్థితికి ప్రసవం సరిగ్గా జరుగుతుందా లేదా అన్న అనుమానం కూడా వచ్చింది. "బాబా ఎలాగైనా ఈ గండం గట్టెక్కించి మమ్మల్ని

కాపాడమని" వారిని వేడుకుంటూ ప్రతిరోజూ బాబావారి ఊదీ నీళ్ళల్లో కలిపి తనకి ఇచ్చేవాళ్ళం. ప్రసవ సమయానికి నెల రోజుల ముందుగానే బాబా దయవల్ల వాడు ప్రాణం పోసుకున్నాడు. అందరం ఆ ఉద్రిక్త పరిస్థితి నించి బైటపడి ఊపిరితీసుకున్నాం. వాడు బాబా వెలిగించిన దీపం కనుక వాడికి 'సాయిదీప్' అని నేనే పేరు నిర్ణయించుకున్నాను. మా పెద్దవాళ్ళు ఒప్పుకోరేమో అనుకున్నాను కానీ, వాళ్ళు కూడా ఏమీ అభ్యంతరం పెట్టలేదు.

మా బాబుకి ఊహ తెలిసినప్పటినించి ప్రతి పుట్టిన రోజుకి శిరిడి తీసుకు వెడతాము. వాడికి శిరిడీ వెళ్లడమంటే చాలా ఇష్టం. అక్కడ బాబా దర్శనానికి వెళ్ళినప్పుడు తప్పకుండా సమాధి తాకి నమస్కరించుకుని కానీ రాడు, ఎంత రద్దీగా వున్నా ఎంత సమయమైనా సరే, నేను ఎత్తుకుని ముందుకి వంగి వాడికి సమాధి అందేలా నమస్కారం చేయించాలి. వాడికి 3సంవత్సరముల వయసున్నప్పుడు, శిరిడిలో తప్పిపోయాడు, నేను నా భార్య కంగారు పడుతుంటే, వాడు వెళ్లి సెక్యూరిటీ డెస్క్ దగ్గరకూర్చుని, మేము రాగానే 'వీళ్ళే మా అమ్మా, నాన్న' అని మాతో వచ్చాడు. అయితే ఇదంతా ఎందుకు చెప్తున్నాను అంటే నాకు ఎలాగైతే బాబా అంటే ఇష్టమో అంతకంటే ఎక్కువ ఇష్టం ఉన్న పిల్లవాడిని నాకు ప్రసాదించినందుకు ఆయనకి కృతజ్ఞతా పూర్వక నమస్సులు చెప్పుకుంటున్నాను.

శిరిడి హారతుల పుస్తకం వెనుకవైపు వున్నది పూజ్యశ్రీ మాస్టరుగారని తెలిసాక నేను ఒకసారి గొలగమూడి వెళ్లడం జరిగింది. అక్కడ శ్రీగురుచరిత్ర, శ్రీ సాయి లీలామృతం మొదలైన గ్రంథాలు కొనుక్కుని పారాయణ చెయ్యడం మొదలుపెట్టాను. నాకు గురువెవ్వరో తెలుసుకోవాలని తపనగా ఉండేది. ఆ సంకల్పంతో శ్రీ గురుచరిత్ర పారాయణ చేసేవాడిని.

2024 సంవత్సరంలో విజయదశమికి కొన్నాళ్ళ ముందర నేను బెంగళూరులో ఎప్పుడూ వెళ్లే హెన్నూరులో దక్షిణ అయోధ్య సాయి మందిరానికి వెళ్ళి, బాబాకి నమస్కరించుకుంటున్నప్పుడు నాకు చాలా స్పష్టంగా "విజయదశమికి శిరిడీ రా!" అని వినిపించింది. నేను ఎప్పుడూ విజయదశమికి శిరిడి వెళ్ళను, ఎందుకంటే అప్పుడు చాలా ఎక్కువ మంది భక్తులు ఉంటారు కదా, ఇబ్బందిగా ఉంటుంది అని నా ఉద్దేశం. కానీ చాలా స్పష్టంగా శిరిడి రమ్మని వినిపించింది కదా, అదే ఆయన ఆజ్ఞ అయితే, దేనికీ ఇబ్బంది లేకుండా అన్నీ సమకూడితే వెళదామని ఆన్ లైన్లో ప్రయత్నిస్తే రైలు టికెట్లు, రూము, దర్శనం, అన్నిదొరికాయి. సరే ఇది బాబా ఆజ్ఞ అనుకుని వెళ్ళాను.

నా జీవితానికి అతి ముఖ్యమైన సంఘటన జరిగిన రోజు రానే వచ్చింది. ఆరోజు విజయదశమి!! సాయంత్రం సంధ్య హారతికి నేను ద్వారకామాయిలో కూర్చుని ఉన్నాను. హారతి వినిపిస్తోంది. కళ్ళు మూసుకున్నాను. నెమ్మదిగా మనసు ధ్యానస్థమయ్యింది. అప్పుడు నాకు బాబావారి మాటలు చాలా స్పష్టంగా వినిపించాయి. "నువ్వు గురువు కోసం తపన పడుతున్నావు కదా, నీ గురువు ఎవరో కాదు, నా బిడ్డ భరద్వాజ! మీరు మాస్టర్ అంటారు కదా వారే!! నువ్వు ఆయన రచించిన పుస్తకాలన్నీ కూలంకుషంగా చదువుకుని ఆయన చెప్పిన తత్వాన్ని అర్థం చేసుకుని, ఆయన అడుగుజాడల్లో నడువు. ఇప్పుడు ఇంతమందితో హారతి జరుగుతున్నా, నా మాటలు నీకు ఎలా వినిపిస్తున్నాయో, అలాగే నువ్వు ఈ ప్రపంచంలో ఏ పరిస్థితుల్లో ఉన్నా ఆయన మీద ధ్యాస పెట్టాలి. అందుకే ఇలా నేర్పిస్తున్నాను, నామాటే నీకు ప్రమాణం" అని చెప్పారు. నేను ఒక్కసారి కళ్ళు తెరిచి చుట్టూ చూసాను, అందరూ హారతిలో మునిగి వున్నారు. నాకు సాయినాథులవారు చేసిన ఈ బోధకు తన్మయత్వంతో ఆనంద పరవశుడనై, కన్నుల బాష్పధారలు కారుతుండగా నాపై ఆయన వర్షించిన అనుగ్రహానికి శిరస్సువంచి మనస్సులోనే కృతజ్ఞతాపూర్వక పాదాభివందనం సమర్పించాను.

ఆవిధంగా వారంటే ఏమిటో తెలియని నన్ను, తనవాడిగా చేసుకుని, నా జీవితమంతా తానే నడిపిస్తూ నన్ను అనుగ్రహిస్తున్న వారి కృపాకటాక్షాలకు మనసా శిరసా వచసా వందనములు!! ●

# ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీ జయ చంద్రారెడ్డి, నెల్లూరు

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల దివ్యలీలావైభవాన్ని, వారి కరుణను, వారి గురుత్వాన్ని నెల్లూరు వాస్తవ్యులు జయచంద్రారెడ్డిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు –

## విద్యార్థి దశలో గురు శిక్షణ – క్రమశిక్షణ

1969 నుంచి నేను పూజ్యశ్రీ మాస్టరుగారి విద్యార్థిని. విద్యానగర్ కళాశాలలో 1972లో స్పెషల్ ఇంగ్లీషుతో డిగ్రీ పూర్తిచేశాను. ఆ సబ్జెక్టు పూజ్యశ్రీ మాస్టరుగారే బోధించేవారు. అందువల్ల ఆయన తరగతులకు ఎక్కువగా హాజరయ్యేవాడిని. కానీ అప్పట్లో నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి గొప్పతనం కొంచెం కూడా అర్థం కాలేదు. అర్థంకాలేదు అనేకంటే నేను పరమ హేతువాదిగా వుండేవాడిని అనడం సబబు. అందువల్ల అందరిలాగా ఆయన ఇంటికి వెళ్లడం, వారి సత్సంగాలకు హాజరవ్వడం చేసేవాడిని కాదు. నాకు అప్పట్లో పూజ్యశ్రీ మాస్టరుగారి మీద మూడు విషయాల గురించి కోపంగా కూడా వుండేది.

## ట్యూషన్ నిరాకరించడం

మొదటిది ఏమిటంటే.. ట్యూషన్ చెప్పమని ఆయనను ఒకసారి అడిగితే, "ఏ సందేహాలున్నా తరగతిలోనే అడగాలి. నేను అర్థమయ్యేవరకు చెప్తాను కానీ విడిగా శిక్షణ ఇవ్వను" అని చెప్పారు. దానికి నాకు ఆయన మీద కోపం వచ్చింది.

## తండ్రికి ఉత్తరం రాయడం

ఇక రెండవది.. నేను హాస్టల్లో వుండి చదువుకునేవాడిని. ఒకొక్క అధ్యాపకుడు కొన్ని నెలలు మా హాస్టలుకి వార్డెనుగా వుండేవారు. మొత్తం మా కళాశాల అందరి అధ్యాపకులలో పూజ్యశ్రీ మాస్టరుగారు విధులు నిర్వహించినట్లు వేరెవ్వరు చేయలేదు. వారు ధర్మమూర్తి కనుక ఏ పనైనా పరిపూర్ణంగా చేసేవారు. ఆ సందర్భంలో సాయంత్రం సమయంలో హాస్టలును సందర్శించినప్పుడు మూడుసార్లు నేను హాస్టల్లో లేకుండా సినిమాకి వెళ్లాను. ఆ విషయం వారికి తెలిసి మా నాన్నకి ఉత్తరం వ్రాశారు –– 'మీ అబ్బాయి హాస్టల్లో వుండకుండా సినిమాలకు, షికార్లకు వెళుతున్నాడు. వారాంతరపు పరీక్షలకు (యూనిట్ టెస్ట్ కి) కూడా హాజరు కావడం లేదు. ఇదే విధంగా ప్రవర్తిస్తే రాబోయే సంవత్సరాంతపు పరీక్షలకు (ఫైనల్ ఎగ్జామ్స్) పంపించడం జరగదు' అని! మా నాన్న హాస్టలుకు వచ్చి నన్ను అడిగారు. అదంతా అబద్ధం అని బుకాయించి ఆయన్ని పంపించేశాను. కానీ మనసులో పూజ్యశ్రీ మాస్టరుగారి మీద చాలా కోపంగా వుండేది.

## రౌడియిజం ధోరణిని మార్చడం

తరువాత మూడవది.. ఆరోజుల్లో కళాశాలకు నేను చొక్కా పైవరసలో వుండే గుండీలు(బటన్స్) రెండు పెట్టుకోకుండా వదిలేసేవాడిని. అంటే.. 'ఒక గుండీ వదిలేస్తే చిన్న రౌడీ, రెండు గుండీలు వదిలేస్తే పెద్ద రౌడీ' అని మా భావన. అందుకే అలా చేసేవాడిని. అయితే పూజ్యశ్రీ మాస్టరుగారు చాలా తెలివిగా నాకు గుణపాఠం నేర్పారు. ఒకసారి జనరల్ ఇంగ్లీష్ తరగతిలో ఆడపిల్లలు, మగపిల్లలు అందరూ దాదాపు వందమంది

కూర్చుని వుండగా, ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు తరగతికి వస్తూనే  నా దగ్గరకి వచ్చి నా షర్ట్ గుండీలు పెట్టారు. అందరూ ఘొల్లున నవ్వారు. నాకు చాలా అవమానమైపోయింది.

ఈ మూడు విషయాలు మనసులో పెట్టుకుని ఆయన మీద ద్వేషం పెట్టుకున్నాను. కళాశాల విద్య పూర్తిచేసుకుని బయటకు వచ్చాక దాదాపు పది సంవత్సరాల దాకా పూజ్యశ్రీ మాస్టరుగారిని కలవలేదు.

నాకు 1977 ఫిబ్రవరి 3వ తేదీన జయమ్మతో వివాహం అయ్యింది. ఆమె మాకు దగ్గర బంధువే. ఆమె మాత్రం సాయిబాబా గుడికి వెళ్తూండేది. నాకూ బాబా గురించి చెప్తూ వుండేది కానీ నాకు అంత పట్టేది కాదు. అయితే మరునాడు మా వివాహమనగా సాయినాథుడు నాకు మంచి అనుభవాన్ని ప్రసాదించారు. దానితో నాకు ఆయనపై  నమ్మకం ఏర్పడింది. కానీ, అప్పుడు కూడా పూజ్యశ్రీ మాస్టరుగారిని కలవలేదు.

## పరివర్తన (1983)

1983 వ సంవత్సరంలో నెల్లూరులో ఒకసారి దత్తసాయి మందిరం ఎదురుగా వున్న కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు గ్రౌండులో అల్ ఇండియా సాయి డీవోటీస్  కన్వెన్షన్ జరిగింది. ఆ మీటింగుకి పూజ్యశ్రీ మాస్టరుగారిని ఆహ్వానించారు. ఆ విషయం తెలిసి నేను, నా భార్య  అక్కడకు వెళ్ళాము. మేము అప్పుడు మేము నెల్లూరులో వుండేవాళ్ళము. నేను ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియాలోను, నా భార్య లైబ్రేరియన్ గాను ఉద్యోగాలు చేస్తున్నాము. మేము వెళ్లేసరికి పూజ్యశ్రీ మాస్టరుగారు వేదికమీద వున్నారు. కార్యక్రమమయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారు వేదిక దిగిరాగానే మా దంపతులిద్దరమూ వారికి పాదాభివందనం చేశాము. మమ్మల్ని పైకి లేపుతూ నావైపు చూసి ఆశ్చర్యంగా, "నువ్వు నా దగ్గరకు రావడమేమిటి? నా పాదాలు పట్టుకోవడమేమిటి?" అన్నారు. ఒకప్పటి  నా ప్రవర్తన అంతా ఆయనకి గుర్తుండే నన్నీ ప్రశ్న అడిగారు. వెంటనే నేను, "క్షమించండి మాస్టరుగారూ! 1969లో మొట్టమొదట మిమ్మల్ని చూసినప్పుడే నేనీపని చెయ్యాల్సింది. చాలా తప్పు చేశాను, 10 సంవత్సరములు వృథా చేశాను," అని మొరపెట్టుకుని నా వివాహానికి ముందు నాకు బాబా చేసిన అద్భుతమైన లీల గురించి ఆయనకు చెప్పాను. అప్పుడు వారు, "సాయినాథుడినే అంటిపెట్టుకో, గమ్యం చేరుతావు!" అన్నారు. అంతేకానీ, 'నన్ను అనుసరించు' అని చెప్పలేదు.

అప్పుడే కాదు, ఎప్పుడూ చెప్పలేదు. అది వారి గొప్పతనం. తరవాత  నాకు అర్థమైంది... నేను కళాశాలలో చదువుతున్నప్పుడు వారు కనుక ఆవిధంగా ప్రవర్తించి వుండకపోతే, నేను ఈరోజు  ఇంత బాగా వుండేవాడిని కాదని!  అది మొదలు వారు సమాధి చెందేవరకూ వారిని అంటిపెట్టుకునే వున్నాం. పూజ్యశ్రీ మాస్టరుగారి ఆజ్ఞ మేరకు 1983నుంచి సత్సంగాలు చేసుకోవడం మొదలుపెట్టాము.

## నకిలీ పూనకాల గుట్టు రట్టు చేయడం

మేము లక్ష్మిపురం సాయిబాబా మందిరంలో వారానికి రెండురోజులు -- గురువారం, ఆదివారం సత్సంగాలు చేయడం ప్రారంభించాము. తరువాత దత్తసాయి మందిరంలో కూడా సత్సంగాలు చేసేవాళ్ళం. అయితే లక్ష్మిపురం పక్కనే వున్న నవాబ్ పేటలో ఒకాయన బాబా పూనాడని చెప్పి ప్రశ్నలు చెప్తూ అందరినీ మోసం చేసేవాడు. అక్కడ జనం విపరీతంగా గుమిగూడేవారు. ఈ విషయం తెలిసిన పూజ్యశ్రీ మాస్టరుగారు అక్కడి అమాయక ప్రజలను రక్షించాలన్న ఉద్దేశంతో నాకు ఒక ప్రణాళిక చెప్పి ఒకరోజు అక్కడకి పంపించారు. నేను అక్కడకి వెళ్లేసరికి దాదాపు 100,150 మంది వున్నారు. ఆయనకు  పూనకం వచ్చే సమయానికి ఆయన ముందు నిల్చున్నాను. సమస్య ఏమిటో చెప్పమన్నాడు. "నాకు ఉద్యోగం లేదు స్వామీ!" అనడిగితే, "ఆరు నెలల్లోపే వుద్యోగం వస్తుంది!" అన్నాడు. తరవాత నా వివాహ విషయం కూడా అడిగాను. "అదీ ఆరు నెలల లోపలే జరుగుతుంది!" అన్నాడు. వెంటనే నేను లేచి అందరివైపు తిరిగి నమస్కారం చేసి, "నాకు వివాహమైంది, ఇద్దరు

పిల్లలు. నేను 5 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తున్నాను. ఈయన చెప్పినది ఎంతవరకు నిజమో మీరే తేల్చుకోండి!" అని చెప్పి బయటకు వచ్చేశాను. తరవాత నెమ్మదిగా అక్కడకు జనం వెళ్లడం మానుకున్నారు. అదీ పూజ్యశ్రీ మాస్టరుగారంటే!!

## హేతువాదులలో మార్పు తెచ్చిన మాస్టారు

గొలగమూడిలో ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగం చేస్తున్నారు. అక్కడకు కొంతమంది హేతువాదులు కూడా వచ్చారు. "దేవుడు ఎక్కడ వుంటాడు? ఎలా వుంటాడు? నిరూపించగలరా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధానం చెప్తున్నారు. మధ్యాహ్నం భోజనానికి కూడా లేవకుండా సత్సంగం జరుగుతూనే వుంది. దాదాపు సాయంత్రం దాటిపోతోంది. నాకు బాగా కోపం వచ్చి అక్కడకు వచ్చిన వారి మీద తిరగబడ్డాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను ఆపి, దూరంగా తీసుకెళ్లమని పక్కవారికి చెప్పి, సత్సంగం కొనసాగించారు. చీకటిపడే సమయానికల్లా, అప్పటివరకు వితండవాదం చేసిన విద్యార్థులు భగవంతునిపై నమ్మకం కలిగిందంటూ పూజ్యశ్రీ మాస్టరుగారికి సాష్టాంగ నమస్కారం చేసుకుని వెళ్లిపోయారు. తరవాత పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను పిలిచి, "వీళ్ళని అలా మధ్యలో వదిలేస్తే ఈ సొసైటీనే పాడుచేస్తారు. ఇంకా కొంతమందిని హేతువాదులుగా మార్చే అవకాశం వుంది. మనం ఒక్కపూట భోజనం చేయకపోతే నష్టమేమీ లేదు!" అని చాలా వివరంగా చెప్పారు. ఇలా ఎందరి శ్రేయస్సుకో తన జీవితాన్ని పణంగా పెట్టిన మహోన్నతులు మన పూజ్యశ్రీ మాస్టరుగారు.

## నర్సోబావాడిలో శ్రీగురుని లీల

1985వ సంవత్సరంలో ఒంగోలునుండి దత్తక్షేత్రాలకు బయలుదేరుతూ మమ్మల్నిద్దరిని కూడా రమ్మని కబురు పంపారు పూజ్యశ్రీ మాస్టరుగారు! వెంటనే బయలుదేరి వెళ్ళాము. పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీగురుచరిత్ర వ్రాయడానికి ముందు, 'దత్తావతారలీల' అనే గ్రంథం వ్రాశారు. మేము అప్పట్లో ఆ గ్రంథాన్నే పారాయణ చేసేవారం. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగంలో, శ్రీగురుచరిత్ర నిష్ఠగా పారాయణ చేస్తే శ్రీగురుడు ఏదో ఒక రూపంలో వారి లీలలు ప్రదర్శిస్తారని, ఆయా క్షేత్రాలలో దాని ప్రభావం ఎక్కువగా వుంటుందని, అయితే వారిని గుర్తించి మనం పట్టుకోగలిగి, ఆ అనుభవం చవిచూడగలగాలనీ చెప్పారు. ఆ యాత్రలో భాగంగా నర్సోబావాడి చేరాము. అక్కడ దత్తావతార లీల పారాయణ చేయాలనే ఆలోచన వచ్చింది. వెంటనే నర్సోబావాడి స్నానఘట్టాల వద్ద కృష్ణానది ఒడ్డున పైమెట్టు మీద కూర్చుని పారాయణ మొదలుపెట్టాను. నేను పారాయణ చేస్తున్నప్పుడు నా చుట్టూ కొంతమంది కూర్చుని వింటున్నారు.

కొంతసేపటికి తెల్లటి పంచె, పైన కండువా కప్పుకున్న నల్లటి మనిషి ఆకారం నదిలోనుంచి పైకిలేచినట్లు నాకు లీలగా తెలుస్తోంది. నేను తలెత్తి చూడకుండా పారాయణ చేస్తూనే వున్నాను. చేతి కర్ర సహాయంతో ఒకొక్క మెట్టూ ఎక్కుతూ ఆ ఆకారం నా దగ్గరకు వచ్చి నా ముందు చేయి చాపింది. అయినా నేను తల ఎత్తి చూడకుండా నా జేబులో చెయ్యి పెట్టి రెండు రూపాయలు వారి చేతిలో పెట్టగానే వారు పక్కకు తప్పుకున్నారు. వెంటనే నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన మాటలు గుర్తొచ్చి పారాయణ ఆపి, అతని కోసం ఆ ప్రాంతమంతా వెతికాను. కానీ వారి దర్శనం కాలేదు. శ్రీ గురుని లీలలు ఎంత సూక్ష్మంగా వుంటాయో అన్నదానికి ఇది ఒక తార్కాణం.

## దత్తక్షేత్రాల యాత్రలు

మేము యాత్రలన్నీ పూర్తిచేసుకుని వచ్చిన తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను పిలిచి, "మన రాష్ట్రంలో దత్త సంప్రదాయం గురించి ఎక్కువమందికి తెలియదు. పైగా ఈ క్షేత్రాలకు బస్సు మార్గం కానీ, రైలు మార్గం కానీ సరిగ్గా లేవు. అదే టూరిస్ట్ బస్సు సౌకర్యం వుంటే మన ఇష్టప్రకారం అన్నీ చేసుకుని రావచ్చు. కాబట్టి ఈ బస్సుల బాధ్యత నువ్వు చేపట్టి పదిమందికి ఈ క్షేత్రాలు

చూపించగలవా?" అన్నారు. "సాయి కృప, మీ ఆశీస్సులు వుంటే ఏమైనా చేస్తాను మాస్టరుగారూ!" అన్నాను. అంతే! ఆనాటినుండి దత్తక్షేత్రాలకు యాత్రాబస్సులు నిర్వహిస్తున్నాను. ఇప్పటికి 36 సార్లు బస్సులు వేశాము.

## చివరి ఉత్తరాలు

ఒకసారి తాడిపత్రినుండి కొందరు సాయి భక్తులు పూజ్యశ్రీ మాస్టరుగారికి ఉత్తరం వ్రాశారు... 'మేము దత్తక్షేత్రాలు దర్శించాలనుకుంటున్నాము. వాటిగురించి మాకు అవగాహన లేదు. కనుక మాకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వండి' అని! దానిని పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు ఫార్వర్డ్ చేస్తూ, "Dear Jayachandra, Please inform details. With blessings, Bharadwaja" అని ఆ ఉత్తరంపైన వ్రాసి, 11-4-1989న నాకు పోస్ట్ చేయించారు. అంటే పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందబోయే ముందురోజన్నమాట! అదేరోజున ఇంకొక ఉత్తరం కూడా పోస్ట్ చేశారు. "జయ దంపతులకు, అక్కల్కోటస్వామి పాదుకలు ఒంగోలుకు వచ్చి వున్నాయి, వాటిని దర్శించుకోండి. అవకాశం వుంటే నెల్లూరు తీసుకువెళ్ళండి" అని! పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి అనంతరం మేము కార్యక్రమాలు పూర్తిచేసుకుని నెల్లూరు చేరేటప్పటికి, ఆ ఉత్తరాలు రెండూ మా యింటికి చేరివున్నాయి. అదే మాకు వారు వ్రాసిన చివరి ఉత్తరాలు!

## సజీవ విగ్రహం

వారి సమాధి అనంతరం కొంతకాలానికి Plaster of Paris తో పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహాన్ని తయారు చేయించాము. ఒంగోలు తీసుకెళ్లి పూజ్యశ్రీ అమ్మగారి అనుమతితో అక్కడే వుంచాలని మా ఉద్దేశం. కానీ మేము అక్కడకి వెళ్లేసరికి కావలివాళ్ళు సమర్పించుకున్న విగ్రహం అక్కడ వుంది. కనుక పూజ్యశ్రీ అమ్మగారి సలహా మేరకు విద్యానగర్ మందిరంలో వుంచాలని, మంచి ముహూర్తం చూసి తీసుకెళదామని నెల్లూరులో మా ఇంటికి తీసుకొచ్చాం. ప్రతిరోజూ ఎంతోమంది భక్తులు వచ్చి దర్శించుకునేవారు. 'విగ్రహం బాగుంది కదూ!' అంటూ అందరం చర్చించుకునేవాళ్ళం. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు కలలో కనపడి, "ఏరా! నేను విగ్రహంలా కనిపిస్తున్నానా?" అన్నారు. నా శ్రీమతి జయమ్మకు స్వప్నంలో కనపడి, "నేను విగ్రహాన్నా?!" అంటూ తలను క్రిందకు పైకి లేపుతూ చూపించారట. అలాగే శ్రీదేవిరెడ్డి ప్రభాకరరెడ్డిగారికి స్వప్నంలో, "నన్ను ఒక బొమ్మ అనుకుని పెద్దగదిలో పెట్టి నా చుట్టూ అందరూ చేరి కబుర్లు చెప్పుకుంటూ గోల గోల చేస్తున్నారు" అన్నారట! ఇక అప్పటినుంచి నిత్యం పూజ, నైవేద్యం, భజన, హారతి చేసుకుంటూ సేవించుకుంటూ, ఒక మంచిరోజున విద్యానగర్ ధ్యానమందిరానికి తరలించాము.

## నాస్తికులకు, హేతువాదులకు, సాధకులకు దిశానిర్దేశం

దేవుడు లేదని వాదించే నాస్తికులకు, దేవుడంటూ వుంటే తమ కష్టాలెందుకు తీరడం లేదని వాపోయే వారికి, దేవుడు వుంటే మరి ప్రపంచమంతా అవినీతిమయమైపోతూవుంటే ఊరుకుంటాడేమిటి? అని అడిగే వారికి, ఎంత ప్రార్థించినా, సాధన చేసినా, భక్తిభావంతో మెలిగినా దైవదర్శనం కావడంలేదని ప్రశ్నించేవారికీ, అసలు దేవుడంటే ఏమిటో సశాస్త్రీయంగా వివరిస్తూ, అనేక సందేహాలకు సమాధానమిస్తూ, 'మతం ఎందుకు?', 'విజ్ఞానవీచికలు', 'ఏది నిజం?' అనే వైజ్ఞానిక గ్రంథాలే కాక, మహాత్ముల చరిత్రలు, సాధనకు ఉపకరించే అనేక వ్యాసాలు వ్రాసి, ఎంతోమందిని సమాధానపరచి, ఒక మార్గ నిర్దేశాన్ని చేశారు.

పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారి అంతటి అవతారమూర్తి న భూతో న భవిష్యతి!! వారు ఈ భూమిపై నడయాడుతున్నప్పుడు మేము కూడా జన్మించి వారి సమకాలీనులవడం మా కోట్ల జన్మల పుణ్యఫలం. వారిగురించి ఎంత చెప్పినా తక్కువే! వారి కరుణాకటాక్షాలు ఎల్లవేళలా మాపై వర్షించాలని ప్రార్థిస్తున్నాను. ●

## శ్రీ సాయిబాబాను అసలు ఎందుకు పూజించాలి?

03వ పేజీ తరువాయి

తాత్పర్యము : ధ్యానానికి మూలం గురువు యొక్క మూర్తి, ఆయన యొక్క ఉన్నతస్థితియే పూజకు మూలం. వారి వాక్యమే మంత్రానికి మూలం. వారి కృపయే దుఃఖ విముక్తికి కారణం.

ఇలా మానవజాతి యంతటికీ సమిష్టిగానేగాక ప్రతి వ్యక్తికీ గూడ నిజమైన ఆత్మోద్ధరణకు గురువే మూలం. మనలోని పరమాత్మ తత్వాన్ని మన నుండి మరుగు పరచే అజ్ఞానం మూడు విధాలని శృతి. అవి కామాది మలదోషము, విక్షేపదోషము, ఆవరణదోషము. నిష్కామముగ ధర్మ విహిత కర్మలనాచరించడం వలన మొదటిది, ఇష్టదేవతోపాసన వలన రెండవ దోషమూ తొలగుతాయని, తర్వాత ఆత్మవేత్తను ముముక్షువు ఆశ్రయించి వారి సేవ, సాంగత్యము, బోధ, కృపలవలన మూడవదోషాన్ని నివారించుకొని ఆత్మజ్ఞానాన్ని పొందాలని శాస్త్రం. ఈ సూత్రాన్నే శ్రీకృష్ణుడు **"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా! ఉదేక్ష్యంతితే జ్ఞానం జ్ఞానినస్తత్వదర్శినః"** అని చెప్పారు. "సద్గురువులకు సర్వస్య శరణాగతి, సేవ, పరిప్రశ్నలను చేసిన, వారు నీకు జ్ఞానాన్నుపదేశించగలరు' అని అర్థం. ముల్లోకాలలో తానేమీ ఆశించి ఏమి సాధించ నవసరము లేని (గీత) శ్రీ కృష్ణుడు సాందీపని మహర్షిని గురువుగా సేవించి, 'శ్రేష్ఠుడు దేనినాచరించిన యితరులు దానినే ఆచరిస్తారు' అనే సూత్రాన్ననుసరించి ఆచరించి చూపిన పరమ ధర్మమది.

కనుక ఏ దేశకాలాలకు చెందిన జాతి కవసరమైనరీతిన వారికి ఆత్మపథమును తమ ఉపదేశములోను, ఆచరణలోనూ, చూపిన సద్గురువును ఆశ్రయించక ఆత్మపథంలో ముందుకు పోగలమనుకోవడం దుస్సాహసం. అది ఉపనిషత్తులు, గీత మొదలైన శాస్త్రాలను ధిక్కరించడమే అవుతుంది. జగద్గురువు, యోగీశ్వరుడు అయిన శ్రీకృష్ణుని, అంతకుముందు అదే ధర్మాన్ని ఆచరించి చూపిన శ్రీరాముణ్ణి ధిక్కరించడమే అవుతుంది. అట్టి ధిక్కారమువలన 'ప్రణిపాతేన' అని పై శ్లోకములో చెప్పబడిన మార్గాన్ని విడచినవారమై జ్ఞానాన్ని పొందజాలము. దేవ, గురు, సద్విప్రపూజనములనే దైవీసంపదయైనసత్వగుణంమనలోలోపించిందనడానికి నేటి సద్గురువు నాశ్రయించటానికి యిష్టపడక పోవడమే ఋజువు. అట్టి వారి శ్రద్ధ, యజ్ఞము, దానము, తపస్సు వ్యర్థములని గీత స్పష్టంగా చెబుతూంది. ●

---

## పరిప్రశ్న

05వ పేజీ తరువాయి

ప్రోత్సహించేదిన్నూ. భగవంతుడు స్తోమత ప్రసాదించిన ప్రతివారూ తమ ఆర్జనలో విధిగా కొంతభాగమిలా భగవదర్పితమన్న బుద్ధితో దానం చేయడమే అత్యంత శ్రేయస్కరం. ఇలా చేయక కేవలం గుళ్ళూ, గోపురాలు కట్టడం వలన మత మౌఢ్యము, ధర్మాచరణ లోపించడం జరుగుతుంది. సులువుగా ధనము, కీర్తి గడించగోరు స్వార్థపరులకు మతమన్నది ఒక చక్కని విక్రయశాలగా మారుతుంది. మేలు జరిగే బదులు కీడెక్కువ జరుగుతుంది. సామాన్యమైన ఆర్థిక స్తోమత గలవారు యధాశక్తి వీటి ప్రతులను కష్టంలోవున్న పేదలకు, ఆత్మీయులకు, యీ సద్గ్రంథాలు విద్యాదానంగా, భగవంతుని సేవగా యిచ్చి పారాయణ చేసుకొమ్మని చెప్పి వారు మేలుపొందాక కృతజ్ఞతతో యీ సత్కార్యంలోనే యధాశక్తి పాల్గొనమని చెప్పాలి. ఇలా ఒకటి రెండు దశాబ్దాలు చేస్తే మన దేశంలో చదవడం వచ్చిన వారందరికీ శ్రీ సాయినాథుడు, శ్రీ దత్త సాంప్రదాయమూ పరిచయమవుతారు.●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే
# రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹249.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹249.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |
| Sri Swami Samartha (Odiya) | ₹75.00 |

# మాతృదేవి పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ ఆరాధనా మహోత్సవము












Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Postal Registration Number : Prakasam/2026-2028, Regd. No. APTEL/26/A0220



మాతృదేవి పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఐదవ ఆరాధనా మహోత్సవము శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానములో 03-07-2026 తేదీన వైభవంగా జరిగింది.

This periodical is published by Revuri Seshachala Sasidhar from Ongole on behalf of Ekkirala Vikramaditya, edited by Revuri Seshachala Sasidhar and printed by Janatha Offset Printers at Nirmal Nagar, Ongole".
[according to the Press and Registration of Periodicals (PRP) Act, 2023].